



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక : 226 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 22 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :226 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 22 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




# సిట్ విచారణకు హాజరవుతున్నా

- ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి
- మరో ఆడియో సందేశం విడుదల
- నేడు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య సిట్ కార్యాలయానికి వస్తానని వెల్లడి






పెన్ పవర్ డెస్క్:ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆయన నేడు ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. (మంగళవారం) ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య సిట్ అధికారుల ముందు విచారణకు హాజరవుతానని వెల్లడించారు అంతకుముందు, ఇదే కేసులో ముందస్తు బెయిల్ కోసం రాజ్ కసిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇటీవల ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, ఆయనకు మధ్యంతర రక్షణ కల్పించడానికి నిరాకరించింది. ఆయన తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని కోర్టు తోసిపుచ్చింది. తదుపరి

వివరాలు 2లో..

## రాజ్ కసిరెడ్డిని అదుపులోకి తీసుకున్న ఏపీ సిట్ పోలీసులు

- మద్యం స్కాం కేసులో అత్యంత కీలక నిందితుడి ఉన్న రాజ్ కసిరెడ్డి
- దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన వైనం
- శంషాబాద్ ఎయిర్ పోర్టులో అదుపులోకి తీసుకున్న సిట్ పోలీసులు

# మరో భారీ ఎన్ కౌంటర్

- ఝార్ఖండ్‌లో భారీ ఎన్ కౌంటర్.. పెద్ద సంఖ్యలో మావోలు మృతి
- బొకారో జిల్లా 'లుగు' కొండల్లో భారీ ఎన్ కౌంటర్
- ఎనిమిది మంది మావోలను కాల్చి చంపిన బలగాలు
- ఘటనా స్థలి నుంచి పలు ఆయుధాలు స్వాధీనం



పెన్ పవర్ డెస్క్:మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటివరకు చత్తీస్ గఢ్ లో వరుస ఎన్ కౌంటర్లు జరిగితే... తాజాగా ఇప్పుడు ఝార్ఖండ్ కి సీన్ మారింది. ఝార్ఖండ్ లోని బొకారో జిల్లా లాల్పాని యా ప్రాంతంలోని 'లుగు' కొండల్లో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఉదయం నుంచి ఆ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయి. సీఆర్పీఎఫ్ తో కలిసి రాష్ట్ర పోలీసులు నిర్వహించిన సంయుక్త ఆపరేషన్ లో ఎనిమిది మంది మావోయిస్టులు హతమయ్యారు. కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్టు సమాచారం. ఎన్ కౌంటర్ జరిగిన ఘటనాస్థలి నుంచి ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, రైఫిల్స్ వంటి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం

వివరాలు 2లో..

# ఏపీ హైకోర్టులో వల్లభనేని వంశీకి నిరాశ

- స్థలం ఆక్రమణ కేసులో వంశీకి నిరాశ
- కేసును వారంపాటు వాయిదా వేసిన హైకోర్టు
- ఇప్పటికే విజయవాడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీ



వివరాలు 2లో..

## తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల నుంచి ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు ఉత్తర్వులు జారీ
- తెలంగాణ నుంచి జస్టిస్ సురేందర్ మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ శ్రీసుధ కర్ణాటక హైకోర్టుకు బదిలీ
- ఆంధ్రప్రదేశ్ నుంచి జస్టిస్ మన్మథరావు కర్ణాటక హైకోర్టుకు బదిలీ
- అధికారికంగా ఖరారైన న్యాయమూర్తుల బదిలీలు

వివరాలు 2లో..



# "నేను రాక్షసుడ్ని చంపేశాను'

## మాజీ డీజీపీ భార్య వీడియో కాల్!



- సంచలనం సృష్టించిన కర్ణాటక మాజీ డీజీపీ హత్య
- తన ఇంట్లోనే రక్తపు మడుగులో ఓం ప్రకాశ్
- హత్య అనంతరం స్నేహితురాలికి పల్లవి వీడియో కాల్!

పెన్ పవర్ డెస్క్:కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ (68) తన నివా సంలోనే దారుణ హత్యకు గురికావడం సంచలనం సృష్టించింది. బెంగళూరులోని హెచ్ఎస్ఆర్ లేఅవు ట్‌లోని ఆయన నివాసంలోనే ఈ ఘోరం చోటుచే సుకుంది. ఓం ప్రకాశ్ భార్య పల్లవి, కుమార్తె కృతి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. హత్య అనంతరం పల్లవి

వివరాలు 2లో..

### చంద్రబాబుపై అభ్యంతరకర వ్యాఖ్యలు...

## వైసీపీ నేత రాజీవ్ రెడ్డి అరెస్ట్

- సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టేవారిపై ఉక్కుపాదం
- సొంత పార్టీ వారైనా కఠినంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- చంద్రబాబుపై వ్యక్తిగత దూషణలకు పాల్పడినట్టు రాజీవ్ రెడ్డిపై ఫిర్యాదు



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం వచ్చాక సోషల్ మీడి యాలో తప్పుడు పోస్టులు పెట్టేవారిని, యూ ట్యూబ్ చానళ్లలో నోటికొచ్చినట్టు మాట్లాడే వారిని ఎంతమాత్రం ఉపేక్షించడంలేదు. సొంతపార్టీకి చెందిన వారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటోంది. తాజాగా, సీఎం చంద్రబాబుపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన నెల్లూరు జిల్లా వైసీపీ నేత కాకుటూరు రాజీవ్ రెడ్డిని పోలీసులు నేడు అరెస్ట్ చేశారు. రాజీవ్ రెడ్డి చేజర్ల మండలం పాతపాడు గ్రామానికి చెందిన నేత. చంద్రబాబుపై సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలకు

వివరాలు 2లో..

# హైదరాబాద్‌లో ఈ-సిగరెట్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్, అమెరికన్ డాలర్లు సీజ్

- ఈ-సిగరెట్లు, వేప్‌లను విక్రయిస్తున్న ముఠా అరెస్టు
- యువత, విద్యార్థులే లక్ష్యంగా కార్యకలాపాలు
- వాట్సాప్‌లో ప్రత్యేక గ్రూప్‌తో విక్రయం
- నిందితుల నుంచి అమెరికన్, కెనడియన్ డాలర్లు స్వాధీనం



పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్ నగరంలో నిషేధిత ఈ-సిగరెట్లు (వేప్‌లు) అక్రమం గా విక్రయిస్తున్న ముఠాను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్) అధికారులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో యువత, విద్యార్థులే లక్ష్యంగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,

వివరాలు 2లో..

# జనసేన కీలక ప్రకటన

- జనసేన 'జనవాణి' కార్యక్రమం పని వేళల్లో మార్పు
- సోమవారం నుంచి గురువారం వరకు కార్యక్రమం
- ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- కొనసాగింపుగా సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు 'జనవాణి'
- కొత్త పని వేళలు అమల్లోకి వస్తాయని పార్టీ ప్రకటన




పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గతంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు 'జనవాణి' కార్యక్రమాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వివిధ సమస్యలతో ఈ జనవాణికి వచ్చిన ప్రజలను స్వయంగా జనసేనాని కలిసి వారి నుంచి

వివరాలు 2లో..

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

- రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూత
- వాటికన్‌లోని తన నివాసంలో సోమవారం ఉదయం తుదిశ్వాస
- గత కొంతకాలంగా శ్వాసకోశ, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న పోప్
- మృతిని అధికారికంగా ధ్రువీకరించిన వాటికన్ వర్గాలు
- మరణానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ సందేశం ఇచ్చిన పోప్



పెన్ పవర్ డెస్క్:రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది గౌరవించే క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూశారు. ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7:35 గంటలకు వాటికన్‌లోని తన నివాసమైన కాసా శాంటా మార్టాలో ఆయన తుది శ్వాస విడిచినట్లు వాటికన్ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. గత కొంతకాలంగా పోప్ ఫ్రాన్సిస్ శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యుమోనియా, కిడ్నీ సంబంధిత అనారోగ్యాలతో బాధపడుతున్నారు.

వివరాలు 2లో..

# ఏఐతో భారీ నిరుద్యోగం తప్పదు: గేట్స్, ఒబామా



- ఏఐ వల్ల ఉద్యోగాలకు పెను ముప్పు: గేట్స్, ఒబామా ఆందోళన
- ఇది గత శతాబ్దంలో చూడని మార్పుగా అభివర్ణన
- వైద్యులు, టీచర్ల వంటి మేధస్సు AIతో సులభంగా లభ్యం: గేట్స్
- అన్ని రంగాలపై ఏఐ ప్రభావం, కోడింగ్ ఉద్యోగాలకూ ప్రమాదం: ఒబామా
- జీవనోపాధి మార్గాలపై పునరాలోచన తప్పనిసరి అని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మానవ జీవితంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్న తరుణంలో, దాని వల్ల ఉద్యోగ భద్రతకు ఏర్పడబోయే ముప్పుపై ప్రపంచ దిగ్గజాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఏఐ ప్రభావంపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే సంవత్సరాల్లో ఏఐ లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేస్తుందని, ఇది గత వందేళ్లలో ప్రపంచం చూడని

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కట్టడి చేయకుంటే కష్టమే

రాయలసీమ నేతలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంట్రోల్ చేయాల్సి ఉంది. రాయలసీమలో గత ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. వైసీపీ అధినేత జగన్ కు పట్టున్న ప్రాంతమైన రాయలసీమలోనే ఆయనను దెబ్బకొట్టగలిగామన్న సంతృప్తి కూటమి పార్టీల అగ్రనేతల్లో ఎక్కువ సమయం మిగిలేట్లు కనిపించడం లేదు. రాయలసీమలో వచ్చే ఎన్నికల్లోనూ మంచి మెజారిటీ సాధించాలన్నా, జగన్ ను కట్టడి చేయాలన్నా చంద్రబాబు నాయుడు అక్కడి నేతలను కొందరిని కంట్రోలో చేయాల్సి ఉంటుంది. లేకపోతే పెద్దయెత్తున పార్టీ డ్యామేజీ అయ్యే అవకాశాలున్నాయి. రాయలసీమలో నేతలు తమ అడ్డాగా భావించి గిరిగీసుకుని మరీ తమ ప్రపంచంలోకి ఎవరూ రాకూడదని ఆంక్షలు విధిస్తున్నారు.

**ఆది అల్ట్రాటెక్ కంపెనీ...**

నిన్నగాక మొన్న బీజేపీకి చెందిన జమ్మలమడుగుకు చెందిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుచరులు అల్ట్రాటెక్ కంపెనీ నుంచి లారీలను వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ కంపెనీలో ఏ కాంట్రాక్టు పనైనా తమకే అప్పగించాలన్న షరతును ఆది పెట్టారు. లారీలను అడ్డుకోవడంతో కంపెనీ ప్రొడక్షన్ పై ప్రభావం పడింది. దీంతో జిల్లా కలెక్టర్ సీరియస్ అయి ఆదినారాయణరెడ్డి అనుచరులు పదకొండు మంది పై కేసులు నమోదు చేయించారు. గతంలోనూ ఫ్లై యాష్ వివాదంలో ఆదినారాయణరెడ్డి, తాడిపత్రిమున్సిపల్ ఛైర్మన్ జేసీప్రభాకర్ రెడ్డిల మధ్య వివాదం ముదిరింది. ఇద్దరూ తమకే కావాలంటూ పట్టుబట్టడం చంద్రబాబుకు తలనొప్పిగా మారింది. ఈ వివాదం కూడా పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ఉంది.

**తిప్పనివ్వనంటూ...**

తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డి మరొక అడుగు ముందుకు వేసి ప్రయివేటు బస్సుల యజమానులకు వార్నింగ్ ఇచ్చారు.. హైదరాబాద్ లో జరిగిన ప్రయివేటు బస్సు ఓనర్ల సమావేశానికి తనను పిలవకపోవడంపై జేసీ ప్రభాకర్ రెడ్డి గుర్రుగా ఉన్నారు. తనను ఆహ్వానించకుండా బస్సు ఓనర్లు సమావేశం ఎలా నిర్వహిస్తారంటూ ప్రశ్నించారు. తాను కూడా ప్రయివేటు బస్సు ఓనరేనని గుర్తులేదా? అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి నిలదీశారు. ప్రభుత్వానికి బస్సులు లీజు కు ఇస్తే అనంతపురంలో ఎలా నడుపుతారో చూస్తానంటూ బహిరంగంగా వార్నింగ్ ఇచ్చారు. తమ ఇలాకాలో లీజుకు ఇచ్చిన ప్రయివేటు బస్సులు తిరగడానికి లేదంటూ ఆంక్షలు విధించారు.

**హెచ్చరికలతో పాటు...**

తాను ఎప్పటి నుంచో ప్రయివేటు బస్సులను నడుపుతున్నానని, సమావేశానికి తనను పిలవకపోయినా పరవాలేదు కానీ, ఎవరెవరో తమకు ఇష్టం వచ్చినట్లు బస్సులు తిప్పుదామంటే ఊరుకునేది లేదని జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. బస్సులు లీజుకు ఇస్తే తిరగనిస్తామని అనుకోవడం మంచి పద్ధతి కాదనంటూ జేసీ ఒక రకంగా ప్రయివేటు బస్సుల యాజమాన్యానికి హుకుం జారీ చేశారు. ఇలా తమ ఇలాకాలోకి వేరెవరిని రానివ్వకుండా తామే వ్యాపారాలు చేసుకంటామంటూ నేతలు హెచ్చరిస్తుండటంతో పార్టీలకు తలనొప్పిగా మారింది. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని ఈ ఇద్దరిని కంట్రోల్ చేయాలని కోరుతున్నారు. లేకుంటే సీమలో ఈ ప్రభావం వచ్చే ఎన్నికల ఫలితాలపై పడుతుందని హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల నుంచి ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులలో పనిచేస్తున్న ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ జరిగింది. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల ఆధారంగా ఈ బదిలీలను ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల ప్రకారం, తెలంగాణ నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక న్యాయమూర్తి ఇతర రాష్ట్రాల హైకోర్టులకు బదిలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టులో సేవలందిస్తున్న న్యాయమూర్తులలో జస్టిస్ కె. సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. మరో న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీసుధను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ కె. మన్మథరావును కూడా కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేశారు. ఈ బదిలీలకు సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం గతంలో సిఫార్సులు చేసింది. తాజాగా అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో ఈ ప్రక్రియ పూర్తయింది. బదిలీ అయిన న్యాయమూర్తులు త్వరలో తమ కొత్త బాధ్యతలను స్వీకరించే అవకాశం ఉంది.కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు హేమంత్ చందన్ గౌడ్‌ను మద్రాస్ హైకోర్టుకు, కృష్ణన్ నటరాజన్‌ను కేరళకు, సంజయ్ గౌడ్‌ను గుజరాత్‌కు, దీక్షిత్ శ్రీకృష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేశారు.

# "నేను రాక్షసుడ్ని చంపేశాను'

- **మొదటి పేజీ తరువాయి**

తన స్నేహితురాలికి వీడియో కాల్ చేసి, "నేను రాక్షసుడిని చంపేశాను" అని చెప్పినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు పల్లవితో పాటు వారి కుమార్తె కృతిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.కళ్లల్లో కారం, కత్తితో దాడి.. హత్య వెనుక కుటుంబ కలహాలు?పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, ఆదివారం ఓం ప్రకాశ్, పల్లవిల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సహనం కోల్పోయిన పల్లవి, ముందుగా ఓం ప్రకాశ్ ముఖంపై కారం చల్లి, అనంతరం కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసినట్లు తెలుస్తోంది. వారి మూడు అంతస్తుల ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో రక్తపు మడుగులో పడి ఉన్న ఓం ప్రకాశ్ మృతదేహాన్ని గుర్తించారు. ఈ దారుణ హత్య వెనుక దీర్ఘకాలంగా కొనసాగుతున్న కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు (ముఖ్యంగా కర్ణాటకలోని దాండేలిలో ఉన్న భూ వివాదం) ప్రధాన కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. పల్లవి గత కొంతకాలంగా మానసిక సమస్యలతో (స్కిజోఫ్రెనియా) బాధపడుతున్నారని, చికిత్స తీసుకుంటున్నారని కూడా పోలీసు వర్గాలు వెల్లడించాయి. గతంలో కుటుంబ గొడవలపై ఫిర్యాదు చేసేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, తన ఫిర్యాదును సరిగా స్వీకరించలేదని ఆరోపిస్తూ అక్కడే నిరసనకు దిగినట్లు సమాచారం.

**ఓం ప్రకాశ్ నేపథ్యం**

బీహార్‌కు చెందిన ఓం ప్రకాశ్, 1981 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. కర్ణాటక కేడర్‌లో అదనపు ఎస్పీగా కెరీర్ ప్రారంభించి, పలు జిల్లాల్లో ఎస్పీగా,

లోకాయుక్త, అగ్నిమాపక శాఖల్లో ఉన్నత పదవులు నిర్వహించారు. 2015 మార్చి నుంచి 2017 మార్చి వరకు కర్ణాటక డీజీపీ, ఐజీపీగా బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఈ హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతోంది. పోలీసులు పల్లవి, కృతిలను విచారిస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదిక, తదుపరి విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

- **మొదటి పేజీ తరువాయి**

ఈ కారణంగా ఫిబ్రవరిలో ఆసుపత్రిలో చేరి 38 రోజుల పాటు చికిత్స పొంది, గత నెలలోనే డిశ్చార్జ్ అయ్యారు. అర్జెంటీనాలో జన్మించిన ఆయన, దక్షిణ అమెరికా నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ప్రజల పోప్‌గా పేరుగాంచిన ఆయన, సామాజిక అంశాలపై తన గళం వినిపించేవారు.ఆశ్చర్యకరంగా, మరణించడానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ పర్వదినాన సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో వేలాది మంది భక్తులకు ఆయన సందేశం ఇచ్చారు. అనారోగ్యం తర్వాత అంతమంది ప్రజల మధ్యకు రావడం అదే తొలిసారి. ఆయన మృతితో ప్రపంచవ్యాప్తంగా కేథలిక్ సమాజం విషాదంలో మునిగిపోయింది. కార్డినల్ ఫారెల్ ఆయన మృతిని ప్రకటిస్తూ, పోప్ ఫ్రాన్సిస్ జీవితం ప్రభువుకు, చర్చికి సేవ చేయడానికే అంకితమైందని పేర్కొన్నారు.

# ఏఐతో భారీ నిరుద్యోగం తప్పదు: గేట్స్, ఒబామా

- **మొదటి పేజీ తరువాయి**

అతిపెద్ద మార్పు కానుందని వారు స్పష్టం చేశారు. బిల్ గేట్స్ మాట్లాడుతూ, ప్రస్తుతం అరుదుగా లభించే మేధస్సు (ఉదాహరణకు గొప్ప వైద్యులు, ఉపాధ్యాయుల నైపుణ్యం) ఏఐ సహాయంతో రాబోయే దశాబ్ద కాలంలో ఉచితంగా, సర్వసాధారణంగా అందుబాటులోకి వస్తుందన్నారు. "ఇది వైద్య సలహాలు, ట్యూటరింగ్ వంటి అనేక సమస్యలను పరిష్కరిస్తుంది. అయితే, ఇది ఉద్యోగాల స్వరూపాన్ని, పని విధానాలను పూర్తిగా మార్చివేస్తుంది. వారానికి రెండు, మూడు రోజులు పనిచేస్తే సరిపోతుందేమో" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఏఐ ఆవిష్కరణలను ముందుకు తీసుకెళుతుందని అంగీకరిస్తూనే, దానివల్ల కలిగే మార్పులు కొంత భయానకంగా ఉన్నాయని గేట్స్ వ్యాఖ్యానించారు.మరోవైపు, బరాక్ ఒబామా మాట్లాడుతూ, ఏఐ సాంకేతికత గతంలోని అన్ని టెక్నాలజీ మార్పుల కంటే వేగంగా, మరింత ప్రభావవంతంగా ఉండబోతోందని హెచ్చరించారు. "ఇది కేవలం తయారీ రంగంలోని ఆటోమేషన్ లాంటిది కాదు. ఉన్నత స్థాయి మేధోపరమైన పనులను కూడా ఏఐ చేయగలదు. ఇప్పటికే చాలా మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్ల కంటే మెరుగ్గా ఏఐ కోడింగ్ చేయగలుగుతోంది. సిలికాన్ వ్యాలీలో మంచి జీతాలతో ఉన్న ఉద్యోగాలు కూడా ప్రమాదంలో పడతాయి" అని ఒబామా వివరించారు.అత్యున్నత నైపుణ్యం గల నిపుణులు ఏఐని తమ పనిని మెరుగుపరుచుకోవడానికి ఉపయోగిస్తారని, కానీ సాధారణ స్థాయి ఉద్యోగాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఒబామా అన్నారు. "కేవలం కార్మికులు, ఫ్యాక్టరీ ఉద్యోగులే కాదు, ఇప్పుడు అందరూ 'ఉద్యోగం ఎలా సంపాదించాలి? కుటుంబాన్ని పోషించుకోవడానికి ఆదాయం ఎలా పొందాలి?' అని ఆలోచించాల్సిన పరిస్థితి వస్తుంది. మనం ఎంతో ఉత్పత్తి చేస్తున్నప్పుడు, దాన్ని ఎలా పంపిణీ చేయాలి? జీవితంలో మన పరమార్థం ఏమిటి? అనే ప్రశ్నలను మనమందరం ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ఒబామా నొక్కిచెప్పారు.

# హైదరాబాద్‌లో ఈ-సిగరెట్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్, అమెరికన్ డాలర్లు సీజ్

- **మొదటి పేజీ తరువాయి**

ఈ ముఠా సభ్యులు నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలల వద్ద యువతను ఆకర్షించి వారికి ఈ-సిగరెట్లు, వేపింగ్ పరికరాలను విక్రయిస్తున్నారు. ఇందుకోసం 'ఎస్‌ఐడీ' అనే పేరుతో ఒక ప్రత్యేక వాట్సప్ గ్రూప్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ గ్రూప్ ద్వారా సుమారు 500 మందికి పైగా వినియోగదారులకు ఈ నిషేధిత ఉత్పత్తులను సరఫరా చేస్తున్నారని అధికారులు గుర్తించారు.అరెస్టయిన నిందితులు హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రాంతానికి చెందిన అన్నదమ్ములుగా పోలీసులు గుర్తించారు. వీరికి ఢిల్లీకి చెందిన అమిత్, ముంబైకి చెందిన వసీం అనే వ్యక్తులు ప్రధాన సరఫరాదారులుగా వ్యవహరిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా ఈ నిషేధిత ఉత్పత్తులను నగరానికి తెప్పించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.నిందితుల నుంచి సుమారు రూ. 25 లక్షల విలువైన ఈ-సిగరెట్లు, వేపింగ్ పరికరాలు, వాటికి సంబంధించిన లిక్విడ్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 225 అమెరికన్ డాలర్లు, 100 కెనడియన్ డాలర్ల విదేశీ కరెన్సీని కూడా సీజ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# రాజ్ కసిరెడ్డిని అదుపులోకి తీసుకున్న ఏపీ సిట్ పోలీసులు

ఏపీ లిక్కర్ స్కాం కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అత్యంత కీలక నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణకు సమయం పట్టేట్టు ఉండడంతో రేపు సిట్ విచారణకు హాజరవుతున్నానని రాజ్ కసిరెడ్డి స్వయంగా వెల్లడించిన కాసేపటికే, అతడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఏపీ సిట్ పోలీసులు అతడిని హైదరాబాదులోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో అదుపులోకి తీసుకున్నారు. రాజ్ కసిరెడ్డి దుబాయ్ నుంచి హైదరాబాద్ రాగా, పోలీసులు పక్కా సమాచారంతో అతడిని పట్టుకున్నట్టు సమాచారం. ఏపీ పోలీసులు రాజ్ కసిరెడ్డిని కాసేపట్లో విజయవాడ తీసుకురానున్నారు.

## సిట్ విచారణకు

# హాజరవుతున్నా

- **మొదటి పేజీ తరువాయి**

విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. కాగా, సిట్ అధికారులు గతంలో మూడు పర్యాయాలు నోటీసులు ఇచ్చినా రాజ్ కసిరెడ్డి విచారణకు హాజరు కాలేదు. తాజాగా హైకోర్టులోనూ ఊరట లభించకపోవడం, కోర్టులో విచారణ ఆలస్యం అవుతుండడంతో ఆయన సిట్ ఎదుటకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇదే కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత విజయసాయిరెడ్డి సిట్ విచారణకు హాజరైన అనంతరం కూడా రాజ్ కసిరెడ్డి ఒక ఆడియో విడుదల చేశారు. తనపై విజయసాయిరెడ్డి ఆరోపణలు చేసినప్పటికీ, బెయిల్ పిటిషన్ కోర్టు పరిధిలో ఉన్నందున తాను స్పందించడం లేదని ఆ సందేశంలో పేర్కొన్నారు. త్వరలోనే విజయసాయిరెడ్డి బండారం బయటపెడతానని హెచ్చరించారు. ఇప్పుడు న్యాయస్థానంలో అనుకూల నిర్ణయం రాకపోవడంతో సిట్ విచారణను ఎదుర్కోవడానికి సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది.

# జనసేన కీలక ప్రకటన

- **మొదటి పేజీ తరువాయి**

వినతి పత్రాలను తీసుకుని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో తాజాగా జనసేన ఈ కార్యక్రమం నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకుంది. వేసవి కాలం నేపథ్యంలో 'జనవాణి'కి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఈ కార్యక్రమం పనివేళలను మార్చినట్లు పార్టీ ప్రకటించింది. ఇకపై సోమవారం నుంచి గురువారం వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, కొనసాగింపుగా సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ కొత్త పని వేళలు ఇవాళ్టి (ఏప్రిల్ 21) నుంచి అమల్లోకి వస్తాయని జనసేన తెలిపింది. ఈ మేరకు మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

## చంద్రబాబుపై అభ్యంతరకర వ్యాఖ్యలు...

# వైసీపీ నేత రాజీవ్ రెడ్డి అరెస్ట్

- **మొదటి పేజీ తరువాయి**

పాల్పడినట్టు అతడిపై కేసు నమోదైంది. స్థానిక నేతల ఫిర్యాదుతో పోలీసులు రాజీవ్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

## ఏపీ హైకోర్టులో వల్లభనేని

# వంశీకి నిరాశ

**పెన్ పవర్ డెస్క్:**స్థలం ఆక్రమణ కేసులో వైసీపీ నేత వల్లభనేని వంశీకి ఏపీ హైకోర్టులో నిరాశ ఎదురయింది. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను హైకోర్టు ఈరోజు విచారించింది. కేసుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు తీసుకోవాల్సి ఉందని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దీంతో, కేసును హైకోర్టు వారంపాటు వాయిదా వేసింది.

ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి విజయవాడ జైల్లో వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వంశీపై ఈ కేసుతో పాటు గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన కేసు, సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసిన కేసు కూడా ఉన్నాయి. ఈ మూడు కేసుల్లో ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# మరో భారీ ఎన్ కౌంటర్

- **మొదటి పేజీ తరువాయి**

చేసుకున్న బలగాలు వాటిని అక్కడి నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మావోయిస్టుల ఉనికి లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. మావోయిస్టులందరూ లొంగిపోవాలని... లేకపోతే ప్రాణాలతో మిగిలి ఉండరని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హెచ్చరించిన సంగతి విదితమే. ఈ ఎన్ కౌంటర్ కు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# బడి పిల్లలా పని పిల్లలా



విద్యార్థులతో పనులు చేయిస్తున్న ఉపాధ్యాయులు



ఇనుప పైపును భుజాలపై తీసుకు వెళ్తున్న విద్యార్థులు

**సీతానగరం, పెన్ పవర్, ఏప్రిల్ 21:** 18 సంవత్సరాల లోపు పిల్లలు సాధారణ పాఠశాలల్లో చేరి చదువుకోవాల్సిన వయసు సామర్థ్యానికి ఆటంకం కలిగించే మానసిక శారీరక సామాజిక నైతిక హాని కలిగించే ఈ విధమైన పని ద్వారా పిల్లల శ్రమ దోపిడీ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను బాల కార్మికులుగా మారుస్తున్న వైనం సీతానగరం మండలంలో సింగవరం గ్రామపంచాయతీ పరిధిలో ఎంపిపి యూపి స్కూల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనకు గురవుతున్నారు. పాఠశాల నందు విద్యార్థులకు విద్యను బోధించాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థులతో నిత్యం పనులు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి, పాఠశాల ప్రక్కనే మెయిన్ రోడ్డు ఉండడంతో నిత్యం వాహనాలు తిరుగుతూ ఉంటాయి. సింగవరం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు నాలుగు మంది కలిసి దాదాపు 10 కేజీల బరువుతో ఉన్న ఇనుప పైపును భుజాలపై పెట్టుకుని రోడ్డు వెంట పాఠశాల వైపు వెళ్తున్నారు, అక్కడ పని చేసే ఉపాధ్యాయులు ఇప్పటికే పలు విమర్శలు ఎదుర్కొని పలు సమస్యలతోసతమతమవుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి, వీటిపై విద్యాశాఖ అధికారులు ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు,

## వారపు సంత రోజువారి ఆసీలు వసూలుకు బహిరంగ వేలం...



**అడ్డతీగల,పెన్ పవర్, ఏప్రిల్ 21:** అడ్డతీగల గ్రామపంచాయతీ పరిధిలో వారపు సంత మరియు రోజువారి ఆసీలు సంబంధించి 2025, 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 23-04-2025 బుధవారం అడ్డతీగల గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలంపాట నిర్వహించబడుతుందని పంచాయతీ కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు ఈ వేలంపాటలో పాల్గొని వారు గిరిజనులు అయి ఉండాలని ఈ వేలంపాటకు ధరావత్తు 5000 రూపాయలు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని ఇతర వివరాలకు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని పంచాయితీ కార్యదర్శి తెలియజేశారు.

# అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం





**వ్యవసాయ రంగానికి బడ్జెట్లో రూ. 43,402 కోట్లు కేటాయింపు**

**సబ్సిడీపై పవర్ టిల్లర్లు పంపిణీ చేసిన మంత్రి సుభాష్.**

**కాజులూరు,పెన్ పవర్,ఏప్రిల్ 21 :** దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ సంసిద్ధంగా ముందుంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.కాజులూరు మండలం కాజులూరులోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు రాయితీపై మంజూరైన పవర్ టిల్లర్స్11,7స్ప్రేయర్లు రైతులకు సోమవారం మండల తహసిల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్,ఎంపీడీవో జె.రాంబాబు, వ్యవసాయ శాఖ అధికారి అశోక్, కూటమి నాయకుల సమక్షంలో మంత్రి సుభాష్ లబ్ధిదారులకు అందచేశారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ దేశంలో 62 శాతం జనాభా వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు.కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ రంగానికి రూ.43 వేల 402 కోట్లు రూపాయలు బడ్జెట్లో కేటాయించిందని అన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుందని అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ, ప్రకృతి వ్యవసాయం, రైతులకు వడ్డీ లేని రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ, డిజిటల్ వ్యవసాయం, విత్తనాలకు రాయితీ, ఎరువుల సరఫరా, పంటల భీమా, ఉద్యానవన శాఖ, సహకార సంఘాలకు రుణాలు తదితర రంగాలకు అత్యధిక ప్రాముఖ్యత ఇచ్చి బడ్జెట్లో కేటాయింపులు చేసి అన్నదాతను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వానికి రైతాంగానికి మధ్య వారదులుగా వ్యవసాయ శాఖ అధికారులు ఉండి, రైతాంగం సమస్యలను పరిష్కరించాలన్నారు.ఈ సందర్భంగా రాయితీలపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందుకున్న లబ్ధిదారులు కూటమి ప్రభుత్వానికి, మంత్రి సుభాష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల తహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్,ఎంపీడీవో రాంబాబు,మండల వ్యవసాయాధికారి వి.అశోక్, కార్యదర్శి కర్రి ఈశ్వరి,యాళ్ళ కృష్ణారావు,డేగల సతీష్, పేపకాయల బాబ్జి, రెడ్డి శేషారావు, గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక,కోమలివెంకట రమణ,పోతు జ్యోతి కుమార్,కూనపురెడ్డి శివ,గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# బిల్లుల చెల్లింపుకు చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ షణ్మోహన్**



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :** జిల్లాలో తొలివిడత పియంఎవై పథకం క్రింద పేదల కొరకు నిర్మించిన కాలనీలు,టిడ్కో గృహ సముదాయాలకు మౌలిక సదుపాయాల కల్పన, బిల్లుల చెల్లింపుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.

సోమవారం సాయంత్రం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ పేదల గృహనిర్మాణ కార్యక్రమ ప్రగతిపై హౌసింగ్, సమన్వయ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలివిడత పియంఏవై పథకం క్రింద చేపట్టిన అన్ని కాలనీలు, టిడ్కో గృహసముదాయాలకు విద్యుత్, త్రాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని ఆయా శాఖల అధికారులును ఆదేశించారు. ఆయా అంశాల క్రింద నిర్వహించిన పనులుకు చెల్లించాల్సిన బిల్లు మెత్తాలు, పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల వివరాలతో శాఖల వారిగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు.జల్ జీవన్ మిషన్ ద్వారా అన్ని కాలనీలలో పైవులను విస్తరించి,పూర్తయిన గృహాలన్నిటికీ టాప్ లు ఏర్పాటు చేయాలని సూచించారు.అర్బన్ కాలనీలలో అమృత్-2.0 పథకం క్రింద త్రాగునీటి

-4లో

# అర్జీలు పరిష్కారంలో అసంబద్ధ ఎండార్స్మెంట్లు ఇవ్వవద్దు



**– కలెక్టర్ పి ప్రశాంతి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఏప్రియల్ 21:** అర్జీదారుల యొక్క అర్జీల పరిష్కార విషయంలో కంటెంట్‌లకు సంబంధించి అసంబద్ధమైన ఎండార్స్మెంట్లు ఇవ్వడం సరికాదని, బాధ్యతలని సక్రమంగా నిర్వహించినట్లు కాదని, అటువంటి ఎండార్స్మెంట్ జారీ చేసినట్లు గమనిస్తే సంబంధిత అధికారులపై చర్య తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించిన పిజిఆర్ఎస్ లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరిగింది. అదే సమయంలో సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అర్జీలు పరిష్కార విధానంపై ఆదేశాలు జారీ చేయడం జరిగింది. సోమవారం జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, డీఆర్వో టి.సీతారామ మూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.భాగ్య లక్ష్మి, ఎమ్.ఆర్.ఆర్.ప్రేమ్ కుమార్, డి.ఎల్.డి.వో లు ఏ.స్లీవా రెడ్డి, పి.వీణా దేవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వస్తున్న అర్జీలను స్వీకరించడం, వాటికి తగిన విధంగా పరిష్కారం చూపాలని సూచించారు. కొన్ని అర్జీలు పరిష్కారం చెయ్యాల్సి వాటి విషయంలో అసంబద్ధ ఎండార్స్మెంట్లు ఇవ్వడం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అర్జీలను స్వీకరించడం వాటిపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. అంతే కానీ ఏదో ఒక సమాధానం ఇచ్చి పరిష్కారం చేసినట్లు కాదని తెలిపారు. ఇదే తీరు పునరావృత్తం అయితే వారి విషయంలో ఉపేక్షించే ప్రసక్తి లేదని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా రీ ఓపెన్ అయిన అర్జీల విషయంలో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి వాస్తవాలను నిర్ధారించాలన్నారు.

# అన్నా క్యాంటీన్ లో భోజనం చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామా నాయుడు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఏప్రియల్ 21:** పేదవారి ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్ లను ప్రారంభించడం పట్ల ప్రజల నుంచి ప్రశంసలను అందుకోవడం జరిగిందని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి డా.నిమ్మల రామా నాయుడు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్పొరేషన్ సమీపంలోని అన్నా క్యాంటీన్ ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామా నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన తొలి ఐదు సంతకాలలో ఒకటిగా రాష్ట్ర వ్యాప్తంగా 250 అన్నా క్యాంటీన్ లను తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. కేవలం 15 రూపాయలతో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం మూడు పూటల కడుపు నిండా భోజనం చేయడం జరుగుతోందని ప్రజలు చెప్పడం జరిగిందని తెలిపారు. రుచికరంగా, వేడి వేడిగా ఇక్కడ ఆహారం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వివిధ పనులు నిమిత్తం, ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం ఆసుపత్రులకు వొచ్చే వారు, చదువుకునే విద్యార్థులు పలువురు అన్నా క్యాంటీన్ కు రావడం చూసామన్నారు. గత ప్రభుత్వ అధికారంలో 2019లో అన్న క్యాంటీన్లను రద్దు చేయడం దుర్మార్గమైన చర్యగా మంత్రి పేర్కొన్నారు. ఆనాడు పాలకొల్లులో అన్నా క్యాంటీన్లు మూసివేసిన రోజునే తాను తన సొంత డబ్బులతో అన్నా క్యాంటీన్లను నిర్మించానని తెలిపారు. అదేవిధంగా ఆదిరెడ్డి శ్రీనివాసు నేతృత్వంలో రాజమండ్రిలో కూడా అన్న క్యాంటీన్ నిర్వహించడం జరిగిందన్నారు. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు నిర్వహణ వల్ల ఆటో డ్రైవర్లు, కార్మికులు, విద్యార్థులు కేవలం ఐదు రూపాయలతో ఒక పూట ఆకలి తీర్చడం సాధ్యం అయిందని మంత్రి నిమ్మల రామా నాయుడు పేర్కొన్నారు. మంత్రి వెంట శాసనసభ్యులు శ్రీనివాస్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమీషనర్ కేతన్ గార్గ్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిజిహెచ్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఏప్రియల్ 21:** సోమవారం మధ్యాహ్నం జిజిహెచ్ లోని ఐసోలేషన్ వార్డును పరిశీలించిన, అనంతరం మాతా శిశు సంరక్షణ వార్డు, క్రిటికల్ కేర్ బ్లాక్ పనులు పురోగతి పై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎమ్.లక్ష్మీ సూర్య ప్రభను వివరాలు అడిగి తెలుసు కోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఐసోలేషన్ వార్డును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని రావాలని ఆదేశించారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ వార్డును తగిన వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే మాతా శిశు ఆరోగ్య బ్లాక్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గత సమావేశంలో స్పష్టం చేశామన్నారు. 15 రోజుల్లో ఎమ్ సి హెచ్ బ్లాక్ ద్వారా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ బోధన ఆసుపత్రికి అనుసంధానంగా క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా ప్రజలకి అత్యవసర వైద్య సేవలు అందించే విధంగా పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా రోగులకి అందచేస్తున్న వివిధ రకాల వైద్య సేవలు, మానవ వనరులు వివరాలు తెలుసుకోవడం జరిగింది. వైద్యులు, సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించాలని కోరారు.

# అడ్డతీగల లో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ శిక్షణా కార్యక్రమం...



**అడ్డతీగల,పెన్ పవర్, ఏప్రిల్21:** అడ్డతీగల లో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఎన్ .హెచ్. ఆర్ .పి. ఎఫ్ ఫొరం శిక్షణా తరగతులు అడ్డతీగల సాయి సన్నిధి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంస్థ సీఈవో తూము.రామచంద్ర నాయుడు మరియు నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే మాధవి లత మరియు ఎన్ .హెచ్ ఆర్ .పి ఫోరం రాష్ట్ర ఇంచార్జ్ పి.ఏ వలి ఖాన్ హాజరయ్యారు వారికి నియోజకవర్గం జనరల్ సెక్రటరీగా బాధ్యతలు వహిస్తున్న ఏ.రాంప్రసాద్, సతీమణి శ్రీదేవి దంపతులు సంస్థ సభ్యులందరూ ఘన స్వాగతం పలికారు, కార్యక్రమానికి నియోజకవర్గ జనరల్ సెక్రటరీ ఏ. రాంప్రసాద్ అధ్యక్షతన వహించారు. సీఈఓ రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, సంస్థలో చేరిన ప్రతి సభ్యులు శిక్షణ పొంది అవగాహన కలిగి ఉండాలని, హ్యూమన్ రైట్స్, సివిల్ రైట్స్ ,యాంటీ కరప్షన్, సైబర్ క్రైమ్ మొదలగు వాటిపై అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వడం జరిగింది అని మరియు నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. మాధవి లత మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని పొందపరచినటువంటి, ఆర్టికల్స్ సెక్షన్ల పైన అవగాహన కలిగించి శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం రామచంద్ర నాయుడు మాధవి లత చేతుల మీదుగా సభ్యులందరికీ శిక్షణ సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా కన్వీనర్ ప్రేమ స్వరూప్ నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ ముర్ల .సూరిబాబు బోర్డు మెంబర్ పిట్ల. ప్రభాకర్ రంపచోడవరం నియోజకవర్గం మహిళా విభాగం ఇంచార్జ్ ఏ. శ్రీదేవి నియోజకవర్గ కమిటీ సభ్యులు రాజవొమ్మంగి మండలం అడ్డతీగల మండలం వై. రామవరం మండలం అప్పర్ ఏరియా మారేడుమిల్లి మండలం, మరియు రంపచోడవరం మండలాల ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు, సెక్రెటరీలు,వర్కింగ్ ప్రెసిడెంట్లు, సభ్యులు మహిళా విభాగా సభ్యులు తదితరులు సుమారుగా 100 మందికి పైగా శిక్షణ కార్యక్రమంలో లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇప్పటివరకు నియోజకవర్గ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు వహించిన ఏ.రాంప్రసాద్ ని ఇకనుండి రంపచోడవరం నియోజకవర్గం ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగిస్తున్నట్టు సంస్థ సీ ఈ ఓ రామచంద్ర నాయుడు తెలియజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రాంప్రసాద్ కు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

## విద్యుత్తు సర్క్యూట్ షార్ట్ తో గృహము అగ్నికు ఆహుతి

- ప్రభుత్వం అన్ని విధాలుగా ఆకుటుంబాన్ని ఆదుకోవాలి
- సి.పి.ఎం.మండల కార్యదర్శి పులి సంతోష్,కుమార్



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఏప్రిల్.21:**మండలంలోని చొక్కనపల్లి గ్రామంలో సోమవారం విద్యుత్తు సర్క్యూట్,షార్ట్ తో తోడం రాంబాబు గృహము అగ్నికు ఆహుతి అయింది.ఈ విషయం తెలుసుకున్న సి. పి.ఎం.మండల కార్యదర్శి పులిసంతోష్,కుమార్,సంఘటనా స్థలానికి చేరుకొని తోడం రాంబాబు కుటుంబాన్ని ఓదార్చి,పరామర్శించారు. తోడం రాంబాబు ఒక పేద గిరిజన మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారు రెక్కాడితే గాని,కడుపు నిండని పరిస్థితిలో హఠాత్తుగా ఇలా జరగడంతో పండించిన పంట దాన్యం ఐదు క్వింటాలు,మిర్చి,నిత్యావసర వస్తువులు, బట్టలు,వంట పాత్రలు,టి.వి.తదితర వస్తువులన్ని,పూర్తిగా అగ్ని కు ఆహుతి కావడంతో దిక్కుతోచని స్థితిలో రహదారిపై పడ్డారు.సంబందిత అధికారులు ఆ గృహాన్ని పంచనామా నిర్వహించి,ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.తక్షణమే ప్రభుత్వం అన్ని విధాలుగా తోడం రాంబాబు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.సందర్శించిన వారిలో సి.పి.ఎం.మండల నాయకులు తోడం రాజు,మాజీ సర్పంచ్ తోడం చిన్న బూబమ్మ,పీసా కమిటీ కార్యదర్శి తోడం అనిల్,వార్డు సభ్యులు గొంది దారయ్య,సున్నం సీతమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజా పరిషత్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రియల్ 21:** మెర్లపాలెం గ్రామ శివారు వాసంశెట్టి వారి పాలెం లో ఉన్న మండల ప్రజా పరిషత్ పాఠశాల వార్షికోత్సవం సోమ వారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు వారి ఆటపాటలతో అందరినీ అలరించారు. ఫైనల్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి పాచ్చ సాహెబ్ ప్రశంస పత్రాలు అందించారు. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాల లో ప్రతిభను సాటుకున్నారు .మండల విద్యాశాఖ అధికారి వారిని ఎస్ఎంసి కమిటీ వారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గూడపాటిమాణిక్యాలరావు ,ఉపాధ్యాయులు ఎస్వీఎస్ రవికుమార్ ఘనంగా సన్మానించారు.

## 28 నుండి తిరుమలాయపాలెం శ్రీవరహాలక్ష్మీ నృసింహస్వామివారి చందన వార్షికోత్సవాలు

**గోకవరం, పెన్ పవర్, ఏప్రియల్ 21 :** మండలంలోని తిరుమలాయపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వరహ లక్ష్మీ నృసింహస్వామి స్వయంభూ క్షేత్రం చందన వార్షికోత్సవాలు ఈనెల 28 నుండి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కోదూరు శ్రీనివాసరావు తెలిపారు. 28వ తేదీ సోమవారం అంకురార్పణతో ప్రారంభమయ్యే చందన వార్షికోత్సవాలలో సాయంత్రం మూడు గంటలకు గ్రామోత్సవ కార్యక్రమం ఉంటుందని అనంతరం ఐదు గ్రామాల నుంచి వచ్చే తాడిపెద్దుల సమక్షంలో తెల్లవారుజాము వరకు చమురుకాల్పు కార్యక్రమం ఉంటుందని 29వ తేదీ మంగళవారం సాయంత్రం కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కోదూరి శ్రీనివాస్ తెలిపారు. 30వ తేదీ బుధవారం చందనవలుపు కార్యక్రమం అనంతరం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు స్వామి వారి నిజరూప దర్శనం ఉంటుందని అని తెలిపారు 1వ తేదీ గురువారం వసంతోత్సవం పూర్ణాహుతి చక్రతీర్థం అనంతరం పుష్పయాగంతో చందన వార్షికోత్సవ కార్యక్రమాలు ముగింపు ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు. 30వ తేదీ బుధవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.ప్రతిఏటా గంధ అమావాస్య మరుసటి రోజు వచ్చే పాడ్యమి నాటినుండి స్వామి వారి చందనవార్షికోత్సవాలు జరుపబడుతాయని ఆయన అన్నారు.

ఈ మహిమాన్విత స్వయంభూ క్షేత్రాన్ని దాతలు సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆలయకొండపైకి మెట్లు కట్టించారని,"తదేకం"సంస్థ అందించిన సుమారు 18 లక్షల రూపాయలతో ఆలయ మంటపం అదేవిధంగా భక్తులు అందించిన లక్షలాది రూపాయల విరాళాలతో ఆలయంలో ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతున్నదని ప్రతి శనివారం భక్తులకు




అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని విరాళాలు అందజేయు భక్తులు 63046 87218 నంబరును సంప్రదించగలరని కోదూరి శ్రీనివాసరావు కోరారు.

## ఊరు మధ్యలో చెట్టు ఉలిక్కిపడుతున్న ప్రజలు






**కొత్తపేట, పెన్ పవర్, ఏప్రియల్21:**ప్రమాద ఘటికలు మోగిస్తున్న భారీ వృక్షం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా కొత్తపేట మండలం బిల్లకూరు శివారు కముజువారిపాలెం లో ప్రధాన పంట బోదు ప్రక్కన, ఊరుమధ్యన ఉన్న ఏపుగా పెరిగిన భారీ బూరుగుచెట్టు(కఫోక చెట్టు) చుట్టుపక్కల ప్రజలను భయభ్రాంతులను చేస్తుంది. భారీ వర్షాలు ,ఈదురు గాలులు వీచే సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అసలే అల్పంగా ఉండే ఈ చెట్లు ఎప్పుడు పడిపోతాయో, ఎప్పుడూ మధ్యలో విరిగిపోతాయో కూడా తెలియకుండా ఉంటుంది. ఇదివరకు ఈ చెట్లు కున్న డిమాండ్ అంతా ఇంతా కాదు ఈ చెట్లు కాయలు నుండి ఉత్పత్తి అయ్యే దూది గ్రామీణ ప్రజలు దిండ్లు,పరుపులు లో వాడేవారు, కానీ ఇప్పుడు టెక్నాలజీ అందుబాటులో ఉండటం తో వీటికి ప్రధాన్యత తగ్గింది,వీటి కాయలు పక్వానికి వచ్చి కాయలో ఉన్న దూది బయటకు వెదజిమ్మి బాటసారిలుకి,పరిసర ప్రాంతాల్లో ప్రజలు,చిన్న పిల్లలు కంటిలో పడి ఇబ్బందులకు గురిచేస్తోంది.ఈ చెట్టు క్రింద నుండి విద్యుత్తు 11కె.వి లైన్ కరెంటుతీగలు ఉండడంతో ఈ చెట్టువిరిగిపడి ఈ లైన్ మీద పడినట్లయితే కరెంటు స్థబాలు విరిగి తీవ్ర నష్టం వాటిల్లేపరిస్థితిఉంది. అలాగే ఎదురుగా ఉన్న గృహాలపై పడినా గృహం దెబ్బతినే అవకాశం కూడా ఉందని,చెట్టు పక్కనే మండల ప్రజా పరిషత్ పాఠశాల ఉండడంతో స్కూల్ పిల్లలు పరిసర ప్రాంతాలలో సంచరిస్తూ ఉంటారు ఆ సమయంలో ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని స్థానికులు వాపోతున్నారు. స్థానిక పంచాయతీ అధికారులు ఈచెట్టుని తొలగించి రాబోయే ప్రమాదాన్ని అరికట్టాలని ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు.

## బిల్లుల చెల్లింపుకు చర్యలు చేపట్టాలి

- 3 పేజి తరువాయి

సరఫరా పనులు చేపట్టాలన్నారు.పూర్తయిన కాలనీలలో సంబంధిత గ్రామపంచాయితీలు పారిశుద్య నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఆలాగే అన్ని కాలనీలలో పచ్చదనం పెంపొందించేందుకు డ్వామా ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అన్ని కాలనీలలో అంతర్గత విద్యుత్ లైన్ల ఏర్పాటు పూర్తి చేసి ధరఖాస్తు చేసిన లబ్దిదారులకు గృహావసర కనెక్షన్లు కల్పించాలన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా జరిపిన లాండ్ అక్విజిషన్ , డ్వామా, హౌసింగ్ శాఖల ద్వారా చేసిన లాండ్ లెవెలింగ్ పనులకు చెల్లించాల్సిన మొత్తాల జారీ కొరకు ప్రభుత్వాన్ని కోరేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్దం చేయాలని హౌసింగ్ పిడిని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి ఎన్.వి.వి.సత్యన్నారాయణ, డ్వామాపిడి పి.వెంకటలక్ష్మి, ట్రాన్స్కో ఎస్ఈ డి.ప్రసాద్, మెప్మాపిడి పియంవద, ఎల్డిఎం జెఎస్వీఎస్ ప్రసాద్,డిఆర్డిఏ , ఆర్డబ్ల్యూఎస్,టిడ్కో,పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

## చివరి బస్తా వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదే - మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఏప్రియల్ 21:**ప్రస్తుత రబీ సీజన్లో ధాన్యం కొనుగోళ్లు, అమ్మకాల విషయంలో రైతాంగం సంతృప్తిని వ్యక్తం చేసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం ఉదయం రాజమహేంద్రవరం నుండి నిడదవోలు నియోజకవర్గం కానూరు వెళ్లే మార్గమధ్యంలో కాన్వాయ్ ఆపి స్థానిక రైతులతో స్వయంగా ధాన్యం కొనుగోళ్లు, అమ్మకాలపై మంత్రి దుర్గేష్ ఆరా తీశారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తేవాలని మంత్రి దుర్గేష్ రైతులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ, రైతుల సమయం వృథా కాకుండా వాట్సాప్ నెంబర్ 7337359375 ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. తమది రైతులకు మేలు చేసే ప్రభుత్వమని, చివరి బస్తా వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఏ ఒక్క రైతూ అధైర్య పడవద్దని, ఆరుగాలం శ్రమించే ప్రతి రైతన్నకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం ఇచ్చారు. స్వయంగా మంత్రి దుర్గేష్ కాన్వాయ్ ఆపి తమ దగ్గరకు వచ్చి ధాన్యం వివరాలను, రైతాంగం సమస్యలను ఆరా తీయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.

## విద్యారంగం బలోపేతం చేయడమే యుటిఎఫ్ లక్ష్యం

- బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు





**కొత్తపేట, పెన్ పవర్,ఏప్రియల్21:**యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు తో ఐక్య ఉపాధ్యాయ ఫెరడేషన్ కొత్తపేట మండల శాఖ సోమవారం బడి బాటకార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా స్థానిక శాసన సభ్యులు బండారు సత్యానందరావు,యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు విచ్చేసినారు.ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతం చేయడానికి యుటిఎఫ్ చేస్తున్న కృషిని అభినందించారు.ప్రభుత్వం చేపడుతున్న తల్లికి వందనం,ప్రైమరీ స్కూల్ ఏర్పాటు, ఇతర సౌకర్యాల వివరించారు.జ్యోతిబసు మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ బడిలో చేరేటట్లు చేయడం,ప్రభుత్వ విద్యారంగం బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమ ఉద్దేశ్యం అని పేర్కొన్నారు.అనంతరం కొత్తపేట శివారు శ్రీనివాస్ పేటలో బండారు సత్యానందరావుతో పాటు నాయకులు,ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి ,ఉప సర్పంచ్ విళ్ళ మారుతి ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు కంఠంశెట్టి శ్రీనివాసరావు ముత్యాల బాబ్జి, వాసంశెట్టి సత్యనా నారాయణ , యుటిఎఫ్ నాయకులు వై. మురళి, టి.విజయకృష్ణ. కెపిహెచ్ సూర్యారావు, జి రామ్ కుమార్, ఎం నాగరాజు, గుత్తులశ్రీనివాస రావు, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన ఫైర్ మెన్లు బావిలో పడ్డ శునకాల్ని రెస్క్యూ చేసి బయటికి తీసిన వైనం





**చింతలపూడి, పెన్ పవర్, ఏప్రిల్:21:**ఏలూరు జిల్లా చింతలపూడి ఈ రోజుల్లో ఎవరూ ఎటు పోతే నాకెందుకులే అన్న రోజులు. అలాంటిది మండువేసవి ఆపై మూగ జీవాలు ,నోరు తెరిచి సాయం అడగ లేవు. శెట్టి వారిగూడెం లో పొలాలలో ఉన్న ఇరవై అడుగుల బావిలో రెండు కుక్కలు పడ్డాయి,

దైవం మానవ రూపం అన్నట్లు గ్రామంలో అటు గా పొలం నకు వెళ్ళిన గ్రామస్థుడు ఆది వేణు కుక్కల అరుపులు విని వాటిని బయటికి తీయడానికి ఎంత ప్రయత్నించిన కుదరక పోవడంతో చింతలపూడి అగ్ని మాపక కేంద్ర అధికారి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు.మానవత్వంతో స్పందించిన అధికారి కె .వెంకటరెడ్డి వెంటనే తమ సిబ్బంది లీడింగ్ ఫైర్ మెన్ లు రామకృష్ణ, హోం.గార్డ్ బాబురావులను పంపారు,

ఇరవై అడుగుల బావిలో రెస్క్యూ చేసి లీడింగ్ ఫైర్ మెన్ రామకృష్ణ ,ఫైర్ హోం గార్డ్ బాబురావు లు కుక్కల్ని బయటికి తీశారు, సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి మూగ జీవాల ప్రాణాలు కాపాడిన ఫైర్ ఆఫీసర్ వెంకటరెడ్డి, సిబ్బంది రామకృష్ణ ,బాబురావులను గ్రామస్థులు అభినందించారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 21:**రామచంద్రపురం (ఏపీఈపీడీసీఎల్ )డివిజన్ పరిధిలోని ఆలమూరు సబ్ స్టేషన్ కార్యాలయం నందు ఈనెల 24వ తేదీన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు రామచంద్రపురం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రత్నాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలమూరు మండలంలోని వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఎదురయ్యే సేవా లోపాలకు సత్వర న్యాయం చేస్తారన్నారు. ఇట్టి వేదికకు సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ బి సత్యనారాయణతో పాటుగా పలువురు అధికారులు హాజరవుతారని తెలిపారు.

## వేగివాడ ఎస్టీ కాలనీలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



**పెదవేగి, పెన్ పవర్, ఏప్రిల్:21:**ఏలూరు జిల్లా పెదవేగి మండలం వేగివాడలోని ఎస్టీ కాలనీలో శనివారం నాడు స్థానిక కాలనీ ప్రజల కోరిక మేరకు సత్వరమే కంప్రెషర్లను జెసిబిలను ఉపయోగించి డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించడంతోపాటు,రోడ్ నీర్మాణపనులకు దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ ఆదేశించారు,
ఈ నేపథ్యంలో కాలనీలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను సోమవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ పరిశీలించారు,
ఈ సందర్భంగా సత్వరమే తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసి అండగా నిలిచిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి స్థానిక కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## చింతమనేని ని అభినందించిన కొమ్మారెడ్డి పట్టాభి



**దెందులూరు, పెన్ పవర్, ఏప్రిల్:21:**ఏలూరు జిల్లా దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ తో దుగ్గిరాల్లోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర స్వచాంద్ర కార్పొరేషన్ చైర్మన్ శ్రీ కొమ్మారెడ్డి పట్టాభి ఆత్మీయ భేటీ అయ్యారు,ఈ సందర్భంగా ఇటీవల దెందులూరు నియోజకవర్గం లో దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఐదు గంటల పాటు నిరవధికంగా ఎంతో అంకిత భావంతో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ శ్రీ కొమ్మారెడ్డి పట్టాభి అభినందించారు.

## అక్కమ్మ కోనేరుని పరిశీలించిన మునిసిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి




**జంగారెడ్డిగూడెం, పెన్ పవర్, ఏప్రిల్:21:**ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో అక్కమ్మ కోనేరుని పర్యవేక్షించిన మున్సిపల్ చైర్స్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, అక్కమ్మ కోనేరు డెవలప్మెంట్ పనులను మున్సిపల్ చైర్స్ పర్సన్ పర్యవేక్షణ చేశారు వీలైనంత త్వరగా డెవలప్మెంట్ పూర్తి చేయాలని అన్నారు,
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ మున్సిపల్ ఏఈ, 27వ వార్డు కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి. నాయకులు బత్తిన చిన్న. నేట్రు గణేష్ . పెసర గంటి త్రిమూర్తులు కంచుమర్తి ప్రకాష్. తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం నియోజకవర్గం పరిశీలించనున్న మంత్రి నాదెండ్ల మనోహర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**బుట్టాయిగూడెం,పెన్,పవర్, ఏప్రిల్:21:**ఏలూరు జిల్లా పోలవరం
ఏప్రిల్ 23,24 తారీకులో పౌర సరఫరా శాఖ మంత్రివర్యులు శ్రీ నాదెండ్ల మనోహర్ పోలవరం నియోజకవర్గం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లకు తగిన చర్యలు మరియు ఏ అంతరాయం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నా పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఐటీడీఏ.కె.ఆర్. పురం లో పౌరసరఫరా శాఖ మంత్రివర్యులు పర్యటన నిమిత్తం ఐటీడీఏ లో పిఓ రాములు నాయక్ సమక్షంలో అన్ని డిపార్ట్మెంట్ వారితో అత్యవసర సమావేశం చేశారు.రేపు మంత్రి పర్యటన దృష్ట్యా ఎలాంటి అంతరాయం కలవకుండా,సెక్యూరిటీ విషయంలో చాలా జాగ్రత్తగా ,అప్రమత్తంగా ఉండాలని పోలీస్ డిపార్ట్మెంట్ వారికి ఆదేశాలు జారీ చేశారు,ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కరాటం సాయి,కార్యదర్శి గడ్డమనుగు రవి,యన్ డి ఏ కూటమి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బంది పెడితే సంహించేదిలేదు



- రైతుల రహదారి సమస్య పరిష్కారానికై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కృషి

**గోకవరం, పెన్ పవర్, ఏప్రియల్ 21 :** రైతులు పండించిన పంటను రహదారి గుండా బయటకు తరలించే సమయంలో ఎవరైనా అడ్డుపడితే సహించేది లేదని జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ హెచ్చరించారు .గోకవరం రంప యర్రంపాలెం గ్రామాలకు మధ్య ఉన్నటువంటి సుమారు 300 ఎకరాల ఆయకట్టు కలిగిన పంట పొలాలకు సంబంధించిన రహదారి సమస్యను గతంలో స్థానిక రైతులు స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిశీలించేందుకు సోమవారం స్వయంగా పంట పొలాల్లోనికి వెళ్ళి రహదారి మార్గాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. రహదారి సమస్యపై సంబంధిత అధికారులను ఆరా తీశారు ఎమ్మెల్యే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పూర్వం నుండి బురదకాలువ గట్టుపై రాకపోకలు జరిగేవని , అయితే బురద కాలువ ఇసుక మేటలు వేయడంతో దీనిని అదునుగా చూసుకొని ముందు భాగంలో ఉన్నటువంటి ఒక రైతు తన పొలం నుండి పంటను తరలించాలంటే ఎకరానికి ఒక బస్తా చెల్లించాలని డిమాండ్ చేయడం నా దృష్టికి వచ్చిందన్నారు. సుమారు 300 ఎకరాల పంటను ఎకరానికి ఒక బస్తా చొప్పున రైతులను డిమాండ్ చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఏ కష్టం చేయకుండా రైతుల నుండి 200 నుండి 300 ధాన్యం బస్తాలు అన్యాయంగా వసూలు చేయడం తగదన్నారు. రైతుల రహదారి సమస్య పరిష్కారానికి ఆలోచన చేస్తున్నామని గత రికార్డులు ప్రకారం ఎఫ్ ఎమ్ బి ని పరిశీలించామని సుమారు 50 మీటర్ల కాలువ గట్టు మార్గం కలదని తెలిపారు. దాని ప్రకారం పక్కా రోడ్డు నిర్మాణం చేపడతామని తెలియజేశారు. ఇదే విషయంపై రైతులను వెంటబెట్టుకుని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి కలసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉంగరాల రాము, గోకవరం సొసైటీ మాజీ చైర్మన్ గాజంగం సత్తిబాబు, మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి భరత్, బద్దిరెడ్డి అచ్చన్న దొర , బద్దిరెడ్డి బాబి, దాసరి సీతారాం,భూపతిపాలెం స్కూల్ చైర్మన్ గళ్ళ రాము, నియోజవర్గ ఐ టి డి పి ఛాంపియన్ ఉంగరాల గణేష్, నియోజవర్గ సమన్వయ కమిటీ సభ్యులు మండిగ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- జేసి ఎస్.చిన్న రాముడు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఏప్రియల్ 21:**విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగా పలు కార్యక్రమాలను వారి సంక్షేమానికి అమలు చేస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతురాలు అయిన మల్లిం వెంకటేశ్వరికి ఉమా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా రూ. 8,500 విలువ చేసే వీల్ కుర్చీ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ చిన్న రాముడు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల స్వతంత్రతను, జీవన నాణ్యతను మెరుగుపరచడానికి విద్యను అభ్యసించేందుకు, వారి కాళ్ళపై వారు ఆర్థికంగా నిలబడడం కోసం ఉపకరణాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉపకరణాల పంపిణీ ద్వారా వారికి అవసరమైన సహాయక పరికరాలను అందించడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ టీ.సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నేడూ రేపు సదరం క్యాంపులు



**వై రామవరం,పెన్ పవర్, ఏప్రిల్ 21:** మండలంలో అప్పర్ పార్ట్ లో నేడు, లోయర్ పార్ట్ లో రేపు వికలాంగుల కోసం సదరం క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే.బాపన్న దొర తెలిపారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేపు మండలంలో బొడ్డగండి, పాతకోట, గుర్తేడు,దార గడ్డ, కానివాడ, చింతలపూడి పంచాయతీలకు సంబంధించిన వికలాంగులకు మారేడుమిల్లి మండల పరిషత్ కార్యాలయంలో సదరం క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా లోయర్ పార్ట్ లో ఉన్న కోట, ఎర్రం రెడ్డిపాలెం, కె.ఎర్రగొండ,దాలిపాడు,దేవరమడుగుల, చవిటిదిబ్బలు,పనసల పాలెం,చామగడ్డ,వై.రామవరం,యార్లగడ్డ, పి.ఎర్రగొండ పంచాయతీలకు సంబంధించిన వికలాంగులు మండల పరిషత్ కార్యాలయం అడ్డతీగల లోనూ సదరం క్యాంపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన వికలాంగులందరూ సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు.

## గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం





**24 గంటలైనా తెలియని ఆచూకీ ఆందోళనలో బంధువులు.**

**చింతూరు, పెన్ పవర్, ఏప్రిల్ 21:**సీలేరు నది ప్రవాహంలో గల్లంతైన ఇద్దరు యువకులు దిలీప్ శ్రీనివాసుల మృతదేహాల కోసం అధికారులు, ఎన్డీఆర్ బృందం గాలింపు చర్యలు ముమ్మరం గా చేపట్టారు. 24 గంటలు కావస్తున్న మృతదేహాల ఆచూకీ మాత్రం దొరకలేదు. కడసారి చూపు కోసం కన్నవారు బంధువులు స్నేహితులు ఘటన స్థలం వద్దనే ఎదురుచూస్తున్నారు. సబ్ కలెక్టర్, పిఓఐటిడిఏ అపూర్వ భారత్, తాసిల్దార్ చిరంజీవి, ఎస్సై రమేష్ విఆర్ఓ సిబ్బంది ఎప్పటికప్పుడు గాలింపు చర్యలను పరిశీలిస్తున్నారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ బాధితుల కోసం భోజన సదుపాయాన్ని కల్పించి మండుటెండలో ఇబ్బందులు పడుతున్న బంధువులకు త్రాగునీరు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం నుండి సోమవారం సాయంత్రం వరకు జమాల్ ఖాన్ యువకుల మృతదేహాల కోసం అధికారులతో పాటుగా సహాయ చర్యల్లో పాల్గొన్నారు.

## రాజి మార్గమే రాజ మార్గం
## జూనియర్ సివిల్ జడ్జి సి హెచ్ మధు బాబు



**చింతలపూడి, పెన్ పవర్, ఏప్రిల్:21:**ఏలూరు జిల్లా చింతలపూడి స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో మే 10వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ మధు బాబు కోరారు, సోమవారం కోర్టు ఆవరణంలో న్యాయవాదులతో లోక్ అదాలత్ పై కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని సూచించారు మెగా లోక్ అదాలత్ లో క్రిమినల్ సివిల్ బ్యాంక్ రికవరీ చెక్ బౌన్స్ బిఎస్ఎన్ఎల్ రికవరీ కుటుంబ తగాదాలు మనోవర్తి ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకో వచ్చని తెలిపారు రాజీ చేసుకునే వారు ప్రతి రోజు ఫ్రీ లోక్ అదాలత్ సెట్టింగ్స్ నిర్వహిస్తున్నారు కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయము డబ్బు ఆదా అవుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే మాణిక్యాల రావు న్యాయవాదులు కోర్టు సూపరిండెంట్ పి గురవయ్య నాయుడు పాల్గొన్నారు.

## ఏపీజీవీబీ బ్యాంక్ ఖాతాదారులకు ఇన్సూరెన్స్ పై అవగాహన

2 లక్షల చెక్కును ఆదిలక్ష్మి కి అందించిన మేనేజర్ విశ్వనాథ్



**కూనవరం,పెన్ పవర్,ఏప్రిల్ 21.**మండలంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథ్ బ్యాంకు ఖాతాదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా కూనవరం బ్రాంచ్ మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం,ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం,ఆటల్ పెన్షన్ యోజన,జనరల్ ఇన్స్యూరెన్స్ పథకాలపై బ్యాంక్ ఖాతాదారులకు సదస్సు ద్వారా తెలిపారు.పేద,మధ్యతరగతి వారికి చిన్న అమౌంట్ లతో ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు.బాంక్ అకౌంట్ ఉన్న ప్రతి ఒక్కరూ అన్ని ఇన్సూరెన్స్ లను వినియోగించు కోవాలని పేర్కొన్నారు.ఇటీవల అభిచర్ల గ్రామంలో రవ్వ కన్నమ్మ ఆగస్టు నెలలో అనారోగ్య కారణంతో మరణించడం,ఆమె ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమ పదకంలో చేరడం వలన 2 లక్షలు ఇన్స్యూరెన్స్,
ఆమె కూతురు నామిని ఆయిన ఆదిలక్ష్మి కి చెక్ నీ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథ్ అందించారు. మండలంలోని పాలగూడెం నూపా కామయ్య,జగ్గవరం కి చెందిన సో%శీ%దే భద్రమ్మ,టేకులబోరుకు చెందిన రామస్వామి కొండలమ్మ లకు 2లక్షల చెక్కులను నామినీ లకు అందించారు.బ్యాంకు ఖాదాదారులు అందరూ ఇన్స్యూరెన్స్ చేసుకోవాల్సిందిగా ఖాతాదారులకు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ ఐఆర్ఐఎక్స్ ఆపరేషన్ మేనేజర్ రవికుమార్,క్యాషియర్ ప్రవీణ్,మెసెంజర్ పద్మారావు,మాజీ ఎంపీపీ పెంటయ్య పాల్గొన్నారు.

# చింతలపూడి లో హెల్మెట్ మరియు ట్రాఫిక్ నియమ నిబంధనలను గురించి అవగాహనా కార్యక్రమం

**చింతలపూడి, పెన్ పవర్, ఏప్రిల్:21:**ఏలూరు జిల్లా చింతలపూడి డిగ్రీ కాలేజ్ వద్ద విద్యార్థులకు, ప్రజలకు హెల్మెట్ ధారణ వలన కలిగే ఉపయోగాలను గురించి ట్రాఫిక్ నియమ నిబంధనలను గురించి చింతలపూడి ఇన్స్పెక్టర్ సిహెచ్ రాజశేఖర్ చింతలపూడి ఎస్సై కుటుంబరావు గారు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినారు

చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ సిహెచ్. రాజశేఖర్ ఆధ్వర్యంలో, ఎస్ఐ శ్రీ కుటుంబరావు మరియు వారి సిబ్బందితో కలిసి చింతలపూడి డిగ్రీ కాలేజ్ ప్రాంగణంలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు,

ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు, ప్రజలకు హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు,అలాగే ట్రాఫిక్ నియమాల పాటింపు పై అవగాహనను కల్పించినారు

ఈ సందర్భంలో ఇన్స్పెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ, "ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, ట్రాఫిక్ నియమాలను పాటించడం వల్ల మనం క్షేమంగా గమ్యస్థానానికి చేరవచ్చు. ప్రతి వాహనదారుడు తమ వాహనానికి సంబంధించిన ధ్రువ పత్రాలు కలిగి ఉండాలి,

పోలీసులు తనిఖీలు జరిపినపుడు సరైన పత్రాలు చూపించకపోతే



చట్టపరమైన చర్యలు తప్పవు" అని తెలియ చేసినారు,

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "మీరు వాహనం నడిపేటప్పుడు, మీపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యులను గుర్తు పెట్టుకోండి,

హెల్మెట్ ధరించడం వల్ల ఏదైనా ప్రమాద సమయాలలో మీ ప్రాణాలను రక్షించబడే అవకాశం ఉంటుంది" అని సూచించారు,

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ప్రతి ఒక్కరూ వాహనం నడిపే సమయాలలో తగిన పత్రాలను కలిగి ఉంటామని ప్రతిజ్ఞ చేసినారు.

# 24 వ.తేదీ నుండి కళాశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్.పి.రాజు



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఏప్రిల్.21 :**ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని వి.ఆర్.పురం ప్రభుత్వ కళాశాలలో మొదటి,రెండవ పబ్లిక్ పరీక్షలలో ఫెయిల్ అయిన మ్నెదటి రెండవ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు ఏప్రిల్ 24 నుండి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన తరగతులు ప్రభుత్వ కళాశాల,ప్రిన్సిపాల్ పి.రాజు ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని,విద్యార్థులు తప్పనిసరిగా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతాయని,విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా మధ్యాహ్నం భోజనం సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులు వారి వారి తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలని,కళాశాల ప్రిన్సిపాల్ పి.రాజు ఒక ప్రకటనలో మీడియాకు తెలిపారు.

# చింతలపూడిలో మద్యం షాపులపై ఆకస్మిక తనిఖీలు చేసిన ఎక్సైజ్వారు





**చింతలపూడి, పెన్ పవర్, ఏప్రిల్:21:**ఏలూరు జిల్లా చింతలపూడి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ %డ% ఎక్సైజ్ ఏలూరు, శ్రీలత మేడం, డిస్ట్రిక్ట్ ప్రోహినబిషన్ %డ% ఎక్సైజ్ ఆఫీసర్ (డీపీఈఓ), ఏలూరు జిల్లా, ఏ .ఆవులయ్య వారి ఆదేశాలు ప్రకారం చింతలపూడి ప్రొహిబిషన్ %డ% ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో చింతలపూడి మండలం లోని ఎర్రగుంటపల్లి గ్రామము కు చెందిన పరారీ లో ఉన్న జక్కం సీతా రామ రాజు అను వ్యక్తి నీ అదుపులోకి తీసుకొని , చింతలపూడి కోర్టు నందు హాజరు పరచగా,మేజిస్ట్రేట్ వారు రిమాండ్ విధించారు, అలాగే పాత నాటు సారాయి కేసులలో నిందితులు గా ఉన్న గోడా దుర్గా,చిలకా వెంకట రమణ లను చించితలపూడి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వారి ఎదుట 129 బి యన్ యస్ యస్ చట్టం ప్రకారం హాజరు పరచి,బైండ్ ఓవర్ నమోదు చేయడమైనది,

స్టేషన్ పరిది లో గల చింతలపూడి మండలం లోని రేచర్ల మరియు నామవరం గ్రామాలలో నాటు సారాయి రహిత గ్రామాలు దిశగా అవగాహన చేయడమైనది,

చింతలపూడి స్టేషన్ పరిధి లోని చింతలపూడి నగర పంచాయతీ లోని మద్యం షాపులను ఆకస్మిక తనిఖీలు చేయడమైనది,

ఈ దాడులలో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్.ఐ.లు ఆర్.వి.ఎల్.నరసింహా రావు, అబ్దుల్ ఖలీల్,జె.జగ్గారావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వీధిసుబ్రహ్మణ్యం కేసును సిట్ కు అప్పగించాలి





విశ్రాంత డిజిపి ఏ.బి వెంకటేశ్వరరావు డిమాండ్

**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :** వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్ గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోరు డెలివరీ చేసిన కేసును సిట్ తో తిరిగి సమగ్ర విచారణ జరిపించాలని విశ్రాంత డిజిపి ఏబీ వెంకటేశ్వర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను కలసి ఆయన వివరాలు సేకరించారు. వారితో కలిసి కాకినాడ వచ్చి జిల్లా కలెక్టర్ ను కలిసి బాధిత కుటుంబానికి ఇంకా అందవలసిన ఆర్థిక సహాయం గూర్చి చర్చించారు. జిల్లా ఎస్పీని కలిసి కేసు పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ అప్పటి ఎస్.పి,ఇన్చార్జి, డి.ఎస్.పి రెగ్యులర్ డి.ఎస్.పి, టూ టౌన్, సర్పవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సక్రమంగా కేసు విచారణ చేపట్టలేదని అప్పటి ఛార్జ్ షీట్ చూస్తే తేటతెల్లమైందన్నారు. ఈ కేసును సిట్ కు అప్పగించి మొదటి నుంచి దర్యాప్తు చేసి దోషులను గుర్తించి అరెస్టు చెయ్యాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయన వెంట రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్, సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు వీధి సత్యనారాయణ, వీధి నూకరత్నం,తమ్ముడు వీధి నవీన్ కుమార్, ఆర్పిఐ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్ల శ్రీనివాసరావు, చైతన్య ఆర్గనైజేషన్ అధ్యక్షులు కదలి సత్యమూర్తి, కదలి కిషోర్, కోడి కత్తి శీను తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుల సమయంలో జాగ్రత్త అవసరం-ట్రైనర్ జోడాల





**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రియల్ 21:**విపత్తులు వచ్చే సమయంలో ప్రజలు, ఉద్యోగులు ఏవిధముగా ఉండాలి అనే అంశంపై ట్రైనర్ జోడాల వెంకట్ గజ్జరం పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ గండి రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదం, ప్రకృతి వైపరీత్యాల వలన జరిగే నష్టాలను ముందస్తుగా అంచనా వేసి ప్రభుత్వ అందించే సూచనలు, నిబంధనలను పాటించాలి అని కోరారు. వరదలు, సునామి, కోవిడ్ లాంటి పరిస్థితులలో ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలని, నివారణ చర్యలలో పాల్గొనే సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడవచ్చు అని జోడాల అన్నారు. సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ ప్రజల నుండి సహకారం అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మణి, సచివాలయ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జాయింట్ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ. సత్యనారాయణబీ కేఎస్ఈజెడ్ ఎస్డీసీ కెవీ.రామలక్ష్మి, సి పి ఓ త్రినాద్, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి హాజరై, కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలిగింపు, మత్స్యకార భరోసా , డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం 503 అర్జీలు అందాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారంచూపాలని ఆయన స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించండి

ఇంటర్ విద్య విశ్రాంత ఉద్యోగుల వినతి.



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :** రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్య పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇంటర్మీడియట్ విద్య విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సంఘ జిల్లా అధ్యక్షులు కెపి. జగదీశ్వరరావు, కార్యదర్శి ఎ. శివకుమార్, ప్రాంతీయ ఉపాధ్యక్షుడు బిటివివి. పేర్రాజు జిల్లా రెవిన్యూ అధికారి కె.వెంకట్రావు కు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2018నుండి రావలసిన డిఆర్,11వ పీఆర్సీ బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు.ఈహెచ్ఎస్ పథకంలో విశ్రాంత ఉద్యోగులకు అన్ని వ్యాధులకు అన్ని హాస్పిటల్స్ లో వైద్యం అందించాలని,మెడికల్ రీయింబర్స్మెంట్ 2నుండి 5లక్షలకు పెంచాలని అన్నారు.క్వాంటం పెన్షన్ 10 శాతానికి,12నుండి 15శాతానికి పెంచాలని అన్నారు.12వ పీఆర్సీ కమిషన్ నియమించి, ఐఆర్ ప్రకటించాలని,పెండింగ్ 3డిఆర్లు ప్రకటించాలని కోరారు.కార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి నిమిత్తం ఏడు కుట్టు మిషన్లు పంపిణీ



**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 21:** కాకినాడ లయన్స్ క్లబ్ హాల్ వద్ద ఏడుగురు పేద మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం కుట్టు మిషన్లు ఉచితంగా లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలక్రిష్ణ పంపిణి చేశారు.ఈ సందర్భంగా బాలక్రిష్ణ మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు లయన్స్ క్లబ్ కాకినాడ గత 25 ఏళ్ళుగా కృషి చేస్తున్నాదని అందులో భాగంగా 42 ఏళ్ళ నుంచి కుట్టు శిక్షణ కేంద్రాన్ని నడుపు చున్నారన్నారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలకు చేయూతను ఇవ్వడం ఆనందకరమన్నారు.

ఈ కార్యక్రమంలో డేగల రమేష్, ఎంవిఆర్ మోహన కిషోర్, పులవర్తి కుమార్, పివి సుబ్బారావు, వి రామ సుబ్రహ్మణ్యం, జగన్నాథరావు, నేరేళ్ళ మురళి పాల్గొన్నారు.

# ఎన్క్యూఏఎస్ సర్టిఫికెట్ అందజేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :**సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ నాణ్యత సర్టిఫికెట్ పొందిన పీహెచ్సీ, యుపీహెచ్సీ, హెచ్.డ్యు.సీలలో ఉత్తమ సేవలు అందించిన ఏవీ నగరం పీహెచ్సీ, యుపిహెచ్సీలలో ప్రకాశం స్ట్రీట్, జెట్ల పెదకాపు స్ట్రీట్, హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లు బెండపూడి -1, జి.మామిడాడ-3, సర్పవరం -3 సిబ్బందికి ఎన్ఓఏఎస్ సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో పీహెచ్సీ, యుపీహెచ్సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఉత్తీర్ణత సర్టిఫికెట్స్ పొందిన వారిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన సిబ్బంది మరింత నైపుణ్యంతో సేవలు అందించి జాతీయ స్థాయిలో ప్రశంస పత్రాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.కార్యక్రమములో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జె.నరసిహ నాయక్,నోడల్ అధికారి డా.జి. లక్ష్మి డి.పి.ఎం.ఓ, డా.రవి, భారతి,డా. అర్చన,డా. శ్రీవిద్య,డా.శ్రీను చంద్ర, డా. అయేషా, డా. ప్రత్యూష,టి.ఆశ రేఖ డిస్ట్రిక్ట్ క్వాలిటీ మేనేజర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ ను కలిసిన స్టేట్ టాపర్ డి సాయిలక్ష్మి-అభినందించిన కలెక్టర్



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :**కాకినాడ పీ.ఆర్.ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని డీ.సాయిలక్ష్మి ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో 982 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొట్టమొదటి స్థానం సంపాదించింది. ఈ నెల 15న అమరావతిలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ నిర్వహించిన షైనింగ్ స్టార్స్ ఏపీ కార్యక్రమంలో ఆమెకు మంత్రి లోకేష్ చేతులు మీదుగా మెడల్, ల్యాప్ టాప్ అందుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జరుగుతున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను డీ.సాయిలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.తిరుపతి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.

# వృద్ధుల ఆరోగ్యం పై ప్రభుత్వ అశ్రద్ధ తగదు

ఆర్ ఎం సి మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్




**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :**వృద్ధుల ఆరోగ్యం కాపాడే భాద్యత ప్రభుత్వానికి లేదా? అని రంగరాయ మెడికల్ కాలేజ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 30 ఏళ్లుగా ఈ మెడికల్ కళాశాల మైదానాన్ని తమ సొంత నిధులు వెచ్చించి వ్యాయామానికి తగిన విధంగా తీర్చుదిద్దుకుని ఉదయం సాయంత్రం రెండుపూటలా నడక ద్వారా తమ ఆరోగ్యం కాపాడు కోవటం జరుగుతుందని అయితే గత కొంత కాలంగా ఆర్. ఎమ్ సి వాకింగ్ ట్రాక్ లోకి తమను అనుమతించడంలేదని ప్రముఖ అడ్వకెట్ మర్ల నరసింహరావు పేర్కొన్నారు.సీనియర్ సిటిజన్లుగా తమ ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వానికి ఉందని అందుకు అనుగుణంగా తమకు అనుకుంలంగా ఉన్న సౌకర్యాలు తమకు అందకుండా చేయడం పాలకులు వైఫల్యమే అన్నారు. ఎవరో ఆకతాయిలు చేసిన పనికి తమను బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ముప్పై ఏళ్ళ క్రితం ఈ మైదానం చెత్తా చేదారం తుప్పలతో కూడి ఉండేదని దానిని సీనియర్ సిటీజన్లు నిధులు సేకరించి వాకర్స్ కు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. ఇప్పటికే అనేక రకాల రోగాలతో సతమతం అవుతూ ఉన్నారని అటువంటి వారు శరీరశ్రమ ద్వారా వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకునే క్రమంలో ఈ ఆర్ ఎమ్ సి గ్రౌండ్ ఎంతో ఉపయోగంగా ఉండేదని దానిని మూసేసి వృద్దులకు అనుమతులు నిరాకరించడం దారుణం అన్నారు.ఇప్పటికైనా ఎంపీ, ఎమ్మెల్యే, ఆర్ ఎమ్ సి ప్రిన్సిపాల్ స్పదించి తిరిగి అనుమతులు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేకా శ్రీనివాస్, గన్ని చౌదరి,పుట్టా సోమన్న,సత్తిరాజు,మార్ని శివ, గోలి శ్రీనివాస్, పాలచర్ల భద్రి, మల్లిపూడి భద్ర రావు, ఉప్పలపాటి రామకృష్ణ,బాష్యం గోవిందరాజులు తదితరులు ఉన్నారు.

# మహిళ ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ ఎస్సై.



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21** : అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకోబోయిన మహిళను గమనించిన ట్రాఫిక్ -1 పి.యస్.మహిళా ఏఎస్ఐ 1209 భావిరిశెట్టి కుమారి బేబీ తక్షణం స్పందించి కాపాడారు.సోమవారం మధ్యాహ్నం సుమారు 12:30 గంటల ప్రాంతంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న మహిళా ట్రాఫిక్ ఏఎస్సై బి. కుమారి బేబీకి వచ్చిన సమాచారం మేరకు,

జగన్నాధపురం బ్రిడ్జి మీద నుంచి కాలువలోకి దూకి చనిపోవాలని ప్రయత్నిస్తున్న సుమారు (60 ) సం. లు వయసు గల మహిళను జగన్నాధపురం బ్రిడ్జిపై నుంచి దూక కుండా,పీసీ. 3589 సిహెచ్.రఘు,పీసీ. 3869 ఎస్. ఫణికృష్ణ, సహాయంతో ఏఎస్ఐ బి. కుమారి బేబీ ఆ మహిళను రక్షించి విచారించగా ఆ మహిళ అనారోగ్యం కారణంగా కాలువలోకి దూకి చనిపోవాలనుకున్నట్లు తెలిపింది.సదరు మహిళ దూళ్ల సుందరం, రామేశ్వరం గ్రామం అని చెప్పినది. ఆ మహిళకు ఏఎస్సై కౌన్సిలింగ్ ఇచ్చి వారి కుటుంబ సభ్యులకు అప్పగించుటకు గాను, కాకినాడ 1 టౌన్ శాంతిభద్రతల పోలీసువారికి అప్పగించారు. విషయం గమనించిన చుట్టూ ప్రక్కల ప్రజలు, వాహన దారులు ట్రాఫిక్ పోలీసులను అభినందించడం జరిగింది.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన రూరల్ ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :**కాకినాడ గుడారిగుంట లో గల కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ కార్యాలయం వద్ద రూరల్ నియోజకవర్గం పరిధిలో గల 4 గురు కి 4 లక్షల 15 వేల 819 రూపాయలు ముఖ్య మంత్రి సహాయనిది ద్వారా మంజూరు అయిన చెక్ లను కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ చేతుల మీదుగా లబ్ధిదారులు (అల్లు ఉమాదేవి, కుంపటి బాబురావు, కంచి సుధారాణి, నిడదవోలు సాయి సత్య సుధీర్) లకు అందజేశారు. ఈ సందర్భంగా పంతం నానాజీ గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అభివృద్ధి కి పెద్ద పీట వేస్తూ, గత ప్రభుత్వ పనితీరు వల్ల ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్న కూడా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత-కటకంశెట్టి వెంకటప్రభాకర్



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :**కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ కాకినాడ రూరల్ టీడీపీ సీనియర్ నాయకులు కటకంశెట్టి వెంకటప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ అధినాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినం పురస్కరించుకుని కరప మండలం అరట్లకట్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి వారి నిర్వహణలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిభిరంలో 300 మంది క్యాంపులో పాల్గొన్నారు అయితే ఇందులో కొంతమందికి కంటి ఆపరేషన్ లు అవసరం అని తెలియడంతో సోమవారం 25 మందికి కంటి ఆపరేషన్ లు చేశారు. ఈ మేరకు కటకంశెట్టి బాబి హాస్పిటల్ కి వెళ్ళి కంటి ఆపరేషన్ చేయించుకున్న వారిని కలిసి ధైర్యం చెప్పి పండ్లు ఇచ్చారు. ఈ సంధర్భంగా కటకంశెట్టి బాబి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని, ఆదివారం జరిగిన శిభిరం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో కాకినాడ రూరల్ నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని కంటివైద్య శిభిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు మెరుగైన కంటిచూపు అందించేందుకు కృషిచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరప మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాస్, దాసరి దొరబాబు, దవులూరి కృష్ణకాంత్, వాసంశెట్టి సత్తిబాబు, పిల్లి వీరభద్రరావు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడకంపై మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సూచిక బోర్డులు ఏర్పాటు




**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రియల్ 21:**రోడ్ ప్రమాదాలను నివారించుటలో భాగంగా హెల్మెట్ వాడకంపై అవగాహన పెంచుటకై మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలో రోడ్ కి ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడమైనదని సంస్థ అధ్యక్షులు అంకెం సురేష్ కుమార్ అన్నారు. విద్య, వైద్యంతో పాటుగా ప్రజలను చైతన్య పరచటం సంస్థ ప్రాథమిక కర్తవ్యమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం కనీస బాధ్యత అని, యజమాని ఇంటి నుంచి భయటకు వెళ్లి తిరిగి వచ్చే వరకు కుటుంబ సభ్యులంతా యజమాని క్షేమంగా చేరాలని ఎంతో ఆశగా ఎదురుచూస్తారని, ప్రాణాలు భద్రంగా కాపాడుకోవడానికి హెల్మెట్ రక్షకతంత్రంలా పనిచేస్తుందని అన్నారు.

సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్ధనరావు మాట్లాడుతూ హెల్మెట్ వాడకంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం జరగాలని, ప్రభుత్వం, పోలీసులతో పాటు సమాజ బాధ్యత కోసం మానవత కూడా నడుం బిగించిందని అన్నారు. ప్రతిఒక్క ద్విచక్ర వాహనదారు విధిగా హెల్మెట్ ధరించి, ప్రాణాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, పోలీసు శాఖ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంధకారంలో ప్రభుత్వ ఆసుపత్రి

భయాందోళనలో రోగులు

**వై రామవరం, పెన్ పవర్,ఏప్రిల్ 21 :** మండల కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే భయాందోళనతో రోగులు అంధకారంలోనే కాలం గడపవలసిన పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు.




మండల కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎప్పుడు రోగులు ఉంటారని తెలిపారు. మండల కేంద్రంలో ఉండడం, 30 పడకల ఆసుపత్రి కావడంతో నిత్యం మెరుగైన వైద్య సేవలను రోగులు పొందుతూ ఉన్నారని అంటున్నారు. మండల పరిధిలో రోగులే కాక, ఇతర మండలాల నుండి కూడా రోగులు వైద్య సహాయం కోసం వస్తూ ఉంటారని తెలిపారు. కానీ ఈ మధ్యకాలంలో నిత్యం ఈదురు గాలులు , ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రోగులు, కుటుంబ సభ్యులు తెలిపారు. అంధకారంలోనే రోగులు భయాందోళనలో బిక్కుబిక్కుమంటున్నారని కుటుంబ సభ్యులు అంటున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో జనరేటర్ కొనుగోలు చేసిన నిరుపయోగంగా ఉందని అంటున్నారు. సిహెచ్సిలో రోగులు ఉన్న వార్డులలో ఇన్వర్టర్లు కూడా లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా లేని సమయంలో జనరేటర్ తో విద్యుత్ సరఫరాను కలిగించ వలసిన బాధ్యత ఎంతైనా ఉందని రోగులు, కుటుంబ సభ్యులు కోరుచున్నారు.

# విద్యుత్తు సరఫరా నిలిపివేత

**టీ నర్సాపురం పెన్ పవర్ ఏప్రిల్ 21 :** బొర్రంపాలెం సబ్ స్టేషన్ యందు వార్షిక మరమ్మత్తులు మరియు కొత్త బ్రేకర్లు ఏర్పాటు నిమిత్తం లో భాగంగా మంగళవారం విద్యుత్తు సరఫరా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఈ ఈ ఆపరేషన్ డివిజన్ పీర్ మహమ్మద్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొర్రంపాలెం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా వినియోగించుకుంటున్న విద్యుత్ వినియోగదారులు నేడు విద్యుత్తు నిలిపివేత ను గమనించగలరని ఆయన తెలిపారు. కావున సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులందరూ సహకరించవలసిందిగా సూచించారు.

# విద్యలో వినూత్నమైన మార్పులు అవసరం -ఎమ్మెల్యే వెంకట్రాజు





**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 21.** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో వినూత్నమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. స్థానిక శార్వానీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటుచేసిన డిజిటల్ తరగతి గదులను ఎమ్మెల్యే వెంకట్రాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పని కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఒత్తిడి లేని చదువు ఎంతో అవసరం అన్నారు. చదువు పేరుతో మోయలేని భారాన్ని విద్యార్థుల భుజస్కంధాలపై పెట్టడం వల్ల వారు శారీరకంగా మానసికంగా ఇబ్బందిపడే పరిస్థితి ఉంది అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్య వ్యవస్థలో మార్పుల్లో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని సూచించారు. గతంతో పోలిస్తే ప్రస్తుత తరుణంలో విద్య వ్యవస్థలో ఎన్నో మార్పులు సంభవించాయన్నారు. ఇటువంటి తరగతి గదులు ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు. అలాగే విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల సైన్స్ పరికరాలను పరిశీలించారు. విద్యార్థులు అంకితభావంతో నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ ప్లేస్ హాస్పిటల్ ఎండి వైద్యులు బొమ్మ రెడ్డి కళాధర్ రెడ్డి, టిడిపి మండల శాఖ అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, జేష్ఠ శ్రీధర్, మద్దిపాటి రమేష్, ఈలి శరత్ బాబు, కొర్లపాటి రాము, కోనపోము ప్రసాద్ బాబు, కొడవటి చిన్న వెంకటేశ్వరరావు, జేష్ఠ శ్రీనివాసరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ వసంత్ కుమార్ ఆశయ సాధనకై కృషి చేస్తాం



**అల్లవరం, పెన్ పవర్,ఏప్రిల్ 21:**కామ్రేడ్ సిపిఎం పార్టి సీనియర్ నాయకులు కామ్రేడ్ పచ్చిమాల వసంతకుకుమార్ 2వ వర్ధంతి సభ అమలాపురం ఎంప్లాయిస్ నందు జరిగింది ముందు గా పార్టీ సీనియర్ నాయకులు పీతల రామచంద్రరావు ఎం.భాస్కరరావులు వసంతకుమార్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు జిల్లా కమిటీ సభ్యులు ఎన్ బలరాం జి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ

కామ్రేడ్ వసంత్ కుమార్ నిరంతరం పేద ప్రజలు బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల కోసం తన జీవితాంతం కృషి చేశారని వసంత్ కుమార్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరుకృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తాడి శ్రీరాం మూర్తి ఏ లక్షణ్ బేబీ శంకర్ పి.శివ తదితరులు పాల్గోన్నారు

# ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, ఏప్రిల్ 21:**

ప్లాస్టిక్ నిషేధంపై తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు, పంచాయతీ సెక్రెటరీ రవిచంద్ర ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ప్లాస్టిక్ నిషేధం పై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ప్లాస్టిక్ వల్ల వచ్చే భయంకరమైన వ్యాధులు గురించి సర్పంచ్ బుచ్చిబాబు వివరించారు. అంతేకాకుండా వాతావరణ కాలుష్యం ఉత్తనమవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వల్ల ఎటువంటి కాలుష్యం వస్తాది ప్లాస్టిక్ వల్ల భావితరాల భవిష్యత్తు ఏ విధంగా అంధకారంలోకి వెళ్ళబోతుంది అనే దానిపై అవగాహన కల్పించారు. ఆరుగొలను గ్రామంలో ప్లాస్టిక్ ని పూర్తిగా నిషేధించడం జరిగింది. ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థిని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

# ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలి

**కాజులూరు,పెన్ పవర్, ఏప్రిల్ 21:**కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లి రాజబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో సోమవారం ఆయన మండల పరిధిలోని ఒంటితాడి, చేదువాడ,కాజులూరు,తదితర గ్రామాలలో పర్యటించి స్థానిక రైతులను కోలుకుని పలు సూచనలు చేశారు. రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా సీఎంఆర్ కే అమ్మాలన్నారు.అప్పుడు మాత్రమే పూర్తి మద్దతు ధర వస్తుందని రాజు బాబు తెలిపారు.కొంతమంది మిల్లర్స్ ప్రైవేటు వ్యక్తుల ద్వారా తక్కువ ధరకు కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తు న్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రైతుల పెట్టిన పెట్టుబడికి ఏమాత్రం సరిపోదని రైతాంగం అప్పుల పాలవుతున్నారని ఆయన గుర్తు చేశారు. ఒకపక్క పెరిగిన ఎరువులు పురుగు మందుల ధరలు మరోపక్క వరి కోత యంత్రాలు ,కౌలు కలగలిపి రైతులకు ఏమి మిగలటం లేదన్నారు.మిల్లర్లు మధ్య వర్తుల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఇప్పటివరకు 75 కేజీల బస్తాకు రూ.1600 ఇస్తున్నప్పటికీ మరో 50 రూపాయలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు.రైతులు ముందుచూపుతో సీఎంఆర్ ద్వారా అమ్ముకుంటే డబ్బులు కూడా తొందరగా వస్తున్నాయని, రైతులు మోసపోవద్దని అలాగే ప్రభుత్వం డిమాండ్ కు తగ్గట్టుగా కొత్త గోనె సంచులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బుడితి ప్రభాకర్ రావు,నామ చంద్రరావు విరవాడ బాబ్జి ఎస్ నూకరాజు యాళ్ల పుల్లయ్య ఎం.యాకోబు తదితరులు పాల్గొన్నారు.



## పాలకోడేరులో ఇళ్లు తొలగింపు ఆపాలి




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, ఏప్రిల్ 21:**ఉండి నియోజకవర్గం పాలకోడేరు లో ఎఎస్ఆర్ నగర్ లో పేదల ఇళ్ళు తొలగింపు ఆపాలని తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్ ప్రజలకు సంఘీభావం గాను స్థానిక పోలీస్ ఐ ల్యాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. తొలుత పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుండి పోలీసు ఐ ల్యాండ్ వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ పాలకోడేరు ఎఎస్ఆర్ లో 1986 నుంచి 130 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని ఆయన తెలిపారు.అక్కడ ప్రజలు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నా ఆదివారం సాయంత్రానికి 42 ఇళ్ళు కూలగొట్టారని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం బుల్డోజర్ రాజకీయాలు ఆపాలని, ఉండి ప్రజా ప్రతినిధి రఘు రామకృష్ణంరాజు ఆరాచాకాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఎఎస్ఆర్ నగర్ లో పేదల ఇల్లు తొలగింపు అన్యాయ మన్నారు. కూల్చివేతలు ఆపాలని సిపిఎం నాయకులు జిల్లా అధికారులను బ్రతిమాలినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అధికార బలం తో భూస్వాములు భూములకు మరింత మేలు చేసేందుకే పేదలను ఎమ్మెల్యే రోడ్డు మీద పడేసారని ఆయన అన్నారు. ఆకివీడు నుండి పాలకోడేరు వరకు కొన్ని వందల పేదల ఇళ్లను దుర్మార్గంగా తొలగిస్తున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ బాబు స్పందించకపో వడం బాధాకరమన్నారు. పేదలపై దాడులను ఆపాలని, సిపిఎం నాయకుల గృహం నిర్బంధం ఆపాలని, పేదలకు ప్రత్యామ్నాయం ఇల్లు స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుల్డోజర్ రాజకీయాలు ఆపాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు,పోతు శ్రీను,పోలా చంద్రశేఖర్, అడపా లోవ,నర్మాల నారాయణరావు, యడవల్లి వెంకట దుర్గారావు,పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.ద

## కోనసీమ రైల్వే పూర్తికి సహకారం అందిస్తానన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ...

- కోనసీమ వాసుల కల సాకారం దిశగా అడుగులు..
- స్వాగతిస్తున్నామన్న ఎంపీ హరీష్ బాలయోగి



**అల్లవరం, పెన్ పవర్, ఏప్రిల్ 21:**కోనసీమ ప్రజల చిరకాల వాంఛ రైల్వే ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు సహకరిస్తానన్న కేంద్ర సహాయ శాఖా మంత్రి శ్రీనివాస వర్మ వాఖ్యలను స్వాగతిస్తున్నామని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.కోనసీమ వాసుల కల సాకారం దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయని అన్నారు.నాడు తండ్రి బాలయోగి అంకురార్పణ చేసిన ఈ ప్రాజెక్టు ఆయన మరణం అనంతరం మరుగున పడిపోయిందని హరీశ్ పేర్కొన్నారు.2014 లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ కాస్త ముందుకు సాగిందని 2019 లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు వేగవంతం అయ్యాయన్నారు.అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ప్రధాని మోడీ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు పూర్వ వైభవం వచ్చేలా కృషి చేటున్నారన్నారు.అలాగే అనకాపల్లిలో ఇటీవల భారీ పరిశ్రమలకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.అదే విధంగా కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ కూడా పూర్తి చేస్తామన్నారు.

## అంజి కుటుంబానికి ఇతోధిక సాయం చేసిన దాతలు



మండపేట.పెన్ పవర్.ఏప్రిల్ 21: రూ. 50,000 నగదు సహాయం.. 50 కేజీల బియ్యం, కిరాణా సరుకుల అందజేత మండపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కుటుంబ పోషణ కష్టంగా మారిన అంజి కుటుంబాన్ని ఆదుకోవాలని దాతలు స్పందించి తమ ఉదారతను చాటుకున్నారు. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చిన దాతలు హితోదికంగా ఆదుకుని, బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు, పట్టణ ప్రజలు సహృదయంతో స్పందించి రూ. 50,316 ఆర్థిక సాయంగా అందించారు. అలాగే వైసీపీ యువజన విభాగం జిల్లా కన్వీనర్ చోడే శ్రీకృష్ణ 50 కేజీల బియ్యం, నెలకు సరిపడే కిరాణా సరుకులు అందజేసి తన ఔదార్యాన్ని చాటారు. ఈ సాయాన్ని సోమవారం టీడీపీ టౌన్ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు బాధిత కుటుంబానికి అందజేశారు. మరో దాత జనసైనికుడు మోరం బాలు కూడా ఉన్నారు. నాపై నమ్మకంతో సహకారం అందించిన దాతలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ..
మీ
నల్లా వెంకట్రావు.

## ఘనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు.





**కె గంగవరం పెన్ పవర్ ఏప్రిల్ 21:** కే గంగవరం మండలం కోటిపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పప్పుల మసేను వెంకన్న (రేవుశీను)ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటిపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రాజరాజేశ్వరి సమేత చాయా సోమేశ్వర స్వామి ఆలయంలో రేవు శీను ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుండి ప్రత్యేక పూజలు అనంతరం మృత్యుంజయ హోమం నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు పప్పుల మసేను వెంకన్న ఇంటి వద్ద నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి 250 మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అదేవిధంగా కుందూరు గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు పప్పుల మసేను వెంకన్న ఆధ్వర్యంలో జ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు వస్త్ర దానం మరియు భోజనాలు ఫ్రూట్స్ పంపిణీ చేశారు.కోట గ్రామంలో రజక వీధిలో ఆరోగ్యంతో బాధపడుతున్న మేడపాటి ప్రసాద్ కి వైద్య ఖర్చులు నిమిత్తం 10,000 రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది. మండల కేంద్రమైన కే గంగవరం గ్రామంలో బస్టాండ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదురుగా టిడిపి సీనియర్ నాయకులు పప్పుల మసేను వెంకన్న హాజరై కేక్ కటింగ్ చేసి 250 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కోటిపల్లి సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు, నేమాని అబ్బు, నేమాని సత్తిబాబు, అల్లూరి దొరబాబు, చిర్రా రాజు కుమార్, తాడల రాంబాబు, నీటి సంఘం అధ్యక్షులు తాడల లోవరాజు, పెరాబత్తుల నాగేశ్వరరావు, మానే చిన్న, పెంటపాటి చిన్ని, ప్రసాద్, దుర్గారావు, వసంత్, టిడిపి నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళు జీఓ ఎప్పటినుంచి అమలు చేస్తారు..?






### సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రశ్న

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, ఏప్రిల్ 21:**హౌస్ ఫర్ ఆల్ అందరికీ ఇళ్ళు అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ ఎప్పటి నుంచి అమలు చేస్తారో తెలపాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రశ్నించారు. జీఓ 23 తక్షణమే అమలు చేయాలని కోరుతూ సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్స్ తో కూడిన వినతిపత్రాన్ని, ఇళ్ళ స్థలాల వ్యక్తిగత అర్జీలు తహసీల్దార్ సునీల్ కుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలిచ్చి పేదల స్వంత ఇంటి కల నెరవేరుస్తాం అన్న హామీ ఎప్పటికి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేసారు. స్వంత ఇళ్ళ లేని పేదలు చాలీ చాలని ఆదాయాలతో నెలకు ఐదు నుంచి ఆరు వేల రూపాయలు ఇళ్ళ అద్దెలు చెల్లించలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది మాసాలు అవుతుందని కాలయాపన లేకుండా తక్షణమే పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ స్థలాలు ఇచ్చే వరకు సీపీఐ పోరాటం నిర్వహిస్తుందన్నారు. ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు కేటాయిం చాలని నాగేశ్వరావు డిమాండ్ చేసారు. ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు వడ్డాది మేరీ, యడవల్లి అన్నపూర్ణ, వై.అక్కమ్మ గ్రంధి మాధవి, వరలక్ష్మి తదితరులు ధర్నాకు నాయకత్వం వహించారు.

## పంచాయతీ కార్యదర్శి రమణకుమారిని పరామర్శించిన ఎమ్మెల్యే నెహ్రూ



**గోకవరం, పెన్ పవర్, ఏప్రియల్ 21 :** మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ చెదల చిన్న కుమార్ రెడ్డి ఇటీవల కాలంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ సోమవారం చిన్నా భార్య, కృష్ణునిపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి రమణకుమారిని పరామర్శించి, ఆమెకు ఆమె కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సెక్రెటరీ చిన్నా తో ఉన్నటువంటి అనుబంధాన్ని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోకవరం మాజీ సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు ,మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ, భూపతిపాలెం స్కూల్ చైర్మన్ గళ్ళ రాము, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఎన్రోల్మెంట్ పై స్పెషల్ డ్రైవ్




**వై రామవరం,పెన్ పవర్, ఏప్రిల్ 21 :** ప్రభుత్వ ఆదేశానుసారము విద్యార్థులను ఎన్రోల్మెంట్ చేయడం కొరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందని ఎంఈఓ 2 వెంకటరమణ తెలిపారు. సోమవారం వైరామవరం వారపు సంతలో స్పెషల్ డ్రైవ్ పై ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే జాయిన్ చేయాలని, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వెయ్యాలని ఎంఈఓ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏడు వారాల వెంకన్నకు 50,000 రూ.విరాళం





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రియల్ 21:**కోనసీమ తిరుమల తిరుమలలో లో శ్రీ చందన వెంకటేశ్వర స్వామి అలివేలుమంగా పద్మావతి సమేతంగా కొలువై ఉన్న స్వయంభు క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఆలయ సన్నిధిలో మేలుకొలుపు సేవా , అలంకార్ణోత్సవం , సుప్రభాత సేవ ,స్వామివారి మొదటి హారతితో, భక్తులకు దర్శనం కల్పించారు . అమ్మవారి వసంత మండపంలోస్వామి వారి అష్టోత్తర పూజ, నిత్య కళ్యాణం లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పి. గన్నవరం గ్రామానికి చెందిన కట్ట విజయ కుమార్, శ్రీలత దంపతులు స్వామివారిని దర్శించుకుని ఆలయంలో జరిగే నూతన అన్నదాన భవన నిర్మాణానికి 50,000 విరాళంగా అందించారు. వీరిని ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా , ఆలయ సూపరిండెంట్ పి.రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## ఇండోర్ స్టేడియం నిర్మాణస్థల పరిశీలన.



**మండపేట. పెన్ పవర్.ఏప్రిల్ 21 :**మండపేట నియోజకవర్గంలో ఇండొర్ - అవుట్ డోర్ స్టేడియం లు నిర్మాణం చేపట్టాలని అమలాపురం ఎంపి గంటి హరీష్ మాధూర్ ను రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కోరారు. దీంతో సోమవారం మాచర గ్రామంలో కమ్యూనిటీ హాల్ శంఖుస్థాపన కార్యక్రమం కు హాజరైన ఎం.పి హరీష్ ఆ కార్యక్రమం అనంతరం మండపేట పట్టణంలో పర్యటించారు. ఏడిద రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం ను పరిశీలించారు.ఎమ్మెల్యే వేగుళ్ళ, జనసేన ఇన్ ఛార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ తో కలసి ఎం.పి ఆ స్థలాలు పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు అహ్లాదకరమైన వాతవరణంలో క్రీడలు నిర్వహణ కు ఎటువంటి సౌకర్యాలు లేవన్నారు. మండపేట పట్టణంతో పాటుగా రాయవరం, కపిలేశ్వరపురం మండల కేంద్రాల్లో ఇండొర్ - అవుట్ డోర్ స్టేడియం లు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కు కృషి చేయాలని ఎం.పి ను ఎమ్మెల్యే కోరారు. తప్పనిసరిగా ఇందుకు కృషి చేస్తానని ఎం.పి హరీష్ హామీ ఇచ్చారు.

# ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నది - ఎమ్మెల్యే మద్ది పాటి



**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 21.** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సోమశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఇతర పాఠశాలలకు దీటుగా ఆంగ్ల విద్య. డిజిటల్ బోర్డులు. విద్యార్థులకు కావలసిన పాఠ్య, నోట్ పుస్తకములు, ఏక రూపు దుస్తులు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద మంచి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అలాగే విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకొస్తున్నామన్నారు. గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గతం ఎంతో ఘనమైన చరిత్ర కలిగిందని కొనియాడారు. ఈ పాఠశాలలో దశాబ్దాల తరబడి ఎంతోమంది చదువుకుని నేడు దేశ విదేశాల్లో స్థిరపడి ఎంతో ఉన్నతమైన స్థితిలో ఉండడం ఆనందదాయకమన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి నేడు విద్యాపరంగా ఉన్నత స్థాయిలో ఉన్నానన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారిని ప్రభుత్వ పాఠశాలలో చదివించి ప్రభుత్వ అందించే సౌకర్యాలను సద్విని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాథమిక పాఠశాలలో చదివి ఐదో తరగతి పూర్తి చేసుకుని వంద మంది విద్యార్థులు ఆరో తరగతిలోకి చేరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జి శ్రీనివాసరావు, ఏ మహేశ్వరరావు, ఉపాధ్యాయులు సిహెచ్ రత్నకుమారి, బోడ వెంకటలక్ష్మి, రత్నమని, కాకి పోసియ్య, పైడి సురేష్ బాబు, దిరుసుపోము సుబ్బారావు, సీఆర్పీ కొయ్య నాగరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం మద్దతుధర రైతులకు అందించాలి

- టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ వి ఎస్ ఎన్ వర్మ



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :** ప్రభుత్వం నిర్దేశించిన ధాన్యం మద్దతు ధర రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ వి ఎస్ ఎన్ వర్మ సూచించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ షన్మోహన్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసే విధంగా అటు ఇరిగేషన్లలో అవ్వనివ్వండి ఇటు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మద్దతు ధరలో అవనివ్వండి కావలసిన నిధులు కేటాయిస్తూ ఉన్నారన్నారు.
గ్రౌండ్ లెవెల్ కి వెళ్తే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఉన్న దళారీ వ్యవస్థ ఏదైతే ఉందో వాళ్లు ఇంకా కూడా కొనసాగుతూ రైతులను తేమ శాతం పేరుతో బెదిరిస్తూ, రైస్ మిల్లర్స్ తో కుమ్మక్కై తక్కువ ధరకే కొనుగోలు చేసే పరిస్థితి కల్పిస్తూ ఉన్నారన్నారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 1725/-లు ఎంఎస్పి రేటు ఇవ్వడం జరుగుతుందన్నారు.అది ఎట్టి పరిస్థితుల్లో రైతుకి చేరాలన్నదే ప్రభుత్వం యొక్క సదుద్దేశమని, ఏదైతే తేమ శాతం పేరుతో రైతు దగ్గర నుంచి తక్కువ ధరకి దళారీలు కొంటున్నారో ఆ విధానాలను అరికట్టాలని అన్నారు. రైతుకి ఎట్టి పరిస్థితుల్లో రూ.1725 రూపాయలు ఎంఎస్పి రేటు ఇవ్వాలని ఏదైతే కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యంతో ఉన్నారో రైతు సేవ కేంద్రాలు ఇదివరకటి రైతు భరోసా కేంద్రాలు వారిని అలెర్ట్ చేసి గ్రామాల్లో సభలు పెట్టి ప్రభుత్వం సేకరించే విధానాన్ని వాళ్ళకి వివరించి రైతు సేవ కేంద్రాల్లోనే సేకరించి ఏదైతే మాయిశ్చర్ తక్కువ వస్తుందో ప్రభుత్వ నిబంధన ప్రకారం ఉన్న విధంగా వారికి మంచి రేటు వచ్చే విధంగా గ్రామసభలు నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన 1725 రూపాయలు ఎంఎస్పి ధర రైతుకు రావడానికి కృషి చేయాలని కోరారు.క్రింది స్థాయి అధికారులు అందరినీ అప్రమత్తం చేయాలని కలెక్టర్ ని కోరడం జరిగింది.దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని,చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

## పిల్లల్ని ప్రభుత్వ పాఠశాల లో చేర్చండి

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి పిలుపు



**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :**స్థానిక ఎన్ టి ఆర్ నగర్ లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మునిసిపల్ పాఠశాల ఆవాసం లో యు టి ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు ప్రతీ ఇంటింటికి తిరిగి ప్రైవేట్ పాఠశాలల్లో చదివే పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లి తండ్రులకు విజ్ఞప్తి చేశారు. అమ్మకు వందనంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు, కంప్యూటర్ విద్య, వ్యాయామవిద్య, మంచి యూనిఫామ్, షూస్,బ్యాగ్ తో పాటు నోట్ బుక్స్ ఇస్తున్నామని, తమ పార్టీ తెచ్చిన స్మార్ట్ సిటీ నిధులతో పాఠశాలల్ని ఎంతో అభివృద్ధి చేసామని,విద్యార్థులకు ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్,కొత్త మెనూ తో మంచి మధ్యాహ్న భోజనాన్ని గుడ్డుతో అందించనున్నామని, శిక్షణ ఉపాధ్యాయులు వున్నారని, ఇంకా ఉపాధ్యాయుల్ని డీఎస్సీ ద్వారా నియమిస్తున్నామని ప్రజలు నాణ్యమైన విద్య కొరకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఎమ్మెల్యే సమక్షంలో సోమవారం సుమారు 20మంది విద్యార్థులను చేర్పించారు.ఎం.ఇ. ఓ లు కె వి వి సత్యనారాయణ, చెవ్వూరి రవి,మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించడానికి తాము భరోసా ఇస్తున్నామని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని, విద్యా శాఖ తరపున హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయురాలు కె.సింహాద్రి,ఉపాధ్యాయులు యు టి ఎఫ్ నాయకులు సిహెచ్ వి రమణ, బి రవి శ్రీనివాస్, సిహెచ్ వరహల బాబు,వజ్రపు మహేష్, వాడపర్తి శ్రీనివాస్, పి కృష్ణం రాజు,పి రాజుబాబు, కె సుబ్బారావు తదితర యూటీఎఫ్ నాయకులు సుమారు 50మంది ఉపాధ్యాయులు పాల్గొనగా, స్థానిక టీడీపీ ఇంచార్జులు దుర్గా ప్రసాద్, జాన్ వెస్లీ తో పాటు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నదాన పథకానికి విరాళం



**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 21 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగారవల్లభ స్వామి దేవస్థానానికి దాతలు రూ. 65,054/- విరాళం అందించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని గుడివాడ గ్రామానికి చెందిన ఎన్. పవన్ కుమార్ అన్నప్రసాద వితరణ పథకానికి ఈ విరాళాన్ని అందజేశారని తెలిపారు. తొలుత దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం ఆలయ అర్చకులు దాతకు ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు.

## ప్రభుత్వ పాఠశాలలలో పిల్లల్ని చేర్పించండి - మన ఊరు బడిని బ్రతికించండి





**యూటిఎఫ్ పిలుపు**

**గంగవరం, పెన్ పవర్, ఏప్రిల్ 21 :**ప్రభుత్వ బడులు ఉంటేనే బడుగు బలహీన వర్గాలు,దళిత,గిరిజన బాలలకు ఉచిత విద్య అందే అవకాశం ఉంటుందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కే కృష్ణ అన్నారు.పాలకులు ఎవరైనా క్రమేపీ ప్రభుత్వ విద్యా రంగం నుండి తప్పుకోవడానికి ప్రైవేటు విద్యాసంస్థల్ని ప్రోత్సహించడానికి అనుగుణంగా వారి చర్యలు ఉంటున్నాయి.

కాబట్టి ఈ గ్రామంలోని తల్లిందండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అమ్మ లాంటి మన ఊరు బడిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలని యుటిఎఫ్ కమిటీ పిలుపునిచ్చింది.

ఒక్కసారి ఊరుబడి కనుమరుగవుతే మళ్లీ వచ్చే అవకాశం లేదని.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఉచితంగా లభించాల్సిన చదువు అంగడి సరుకుగా మారిపోయిందన్నారు.

ప్రభుత్వ విద్యా రంగం అంటే పాలకులు భారంగా భావిస్తున్నారు.

ప్రభుత్వ బడులలోనే విద్యార్థి యొక్క మానసిక వికాసాన్ని, సృజనాత్మకతను వ్యక్తిగత నైపుణ్యాలను స్వేచ్ఛ గా నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు.

గత మూడు రోజులుగా యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ పిలుపు మేరకు గంగవరం మండలం లోని మర్రిపాలెం, జడేరు, పి. రామవరం, ఆముదాలబంద, పెద గార్లపాడు, ఎండపల్లి వంటి పలు గ్రామాల్లో విద్యార్థి తల్లిదండ్రులను ఉద్దేశ్యంచి రూపొందించిన కర పత్రాలను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గంగవరం మండల శాఖ ఆధ్వర్యంలో ఊరురా పంచుతూ తల్లిదండ్రులను చైతన్య పరిచారు. ప్రభుత్వ బడుల్లోనే పిల్లల్ని చేర్పించాలని కోరారు.ఈ

కార్యక్రమంలో అల్లూరి జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ,గంగవరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ వెంకటేశ్వరరావు, సిహెచ్ రాంబాబు దొర,గౌరవ అధ్యక్షులు కె.రఘుబాబు దొర, కారం బొజ్జిదొర,మహిళ అధ్యక్షురాలు రుక్మిణి దేవి, ఎం వెంకన్న దొర, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కుటుంబం ఆత్మహత్యాయత్నం



**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 21 :** పెద్దాపురం మున్సిపల్ రెండవ వైస్ చైర్ పర్సన్ కనకాల మహాలక్ష్మి, ఆమె భర్త సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుమారుడు శ్రీకాంత్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక సూసైడ్ నోట్ రాసి నిద్రమాత్రలు సేవించి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించారు. పరిస్థితి గమనించిన ఇంట్లో పనివారు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం
తరలించారు. భార్యాభర్తల పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్ కి తరలించారు. మహాలక్ష్మి కుటుంబం గత ఏడాది జూన్ నెలలో వైసీపీకి రాజీనామా చేశారు. ఆతరువాత ఏ పార్టీలోనూ చేరలేదు. ప్రస్తుతం ఆమె పెద్దాపురం మున్సిపల్ రెండవ వైస్ చైర్ పర్సన్ గా కొనసాగుతుండగా, ఆమె భర్త సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుమారుడు శ్రీకాంత్ పట్టణంలో మండపేట స్వీట్ మార్ట్ పేరుతో తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన మహాలక్ష్మి కుటుంబాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు అసుపత్రికి వెళ్లి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ముఖ్య ధ్యేయం: రాష్ట్ర మంత్రి నిమ్మల






**జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విచ్ఛిన్నం**

**రూ. కోటితో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి నిమ్మల**

**పెనుమంట్ర (పోడూరు), పెన్ పవర్, ఏప్రిల్- 21 :** రైతు సంక్షేమమే టిడిపి జనసేన బిజెపి (ఎన్డీఏ) కూటమి ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర జలవంద్రుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గంలో రూ కోటి రూపాయలతో ఉల్లంపరు, జిన్నూరు, వేడంగి గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఉల్లంపరు లో రూ. 39. 20 లక్షలతో ఎస్టీ ఏరియాలో సిమెంట్ రహదారి నిర్మాణం, మరో 39.20 లక్షలతో కొంతేరు ఛానల్ బోధి పై గ్రావెల్ రహదారి, జున్నూరులో 26.10 లక్షలతో రామసేతువ పంట కాలువపై గ్రావెల్ రహదారి, ఇదే కాలువపై రూ 8.10 లక్షలతో మట్టి తవ్వకం, వేడంగిలో రూ 7.30 లక్షలతో మట్టపర్రు ఛానల్ కాలవలో మట్టి తవ్వకం పనులకు కూటమి నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు పట్ల గ్రామస్తులు, రైతులు, మహిళలు సంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి రామానాయుడుకు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నాడు జగన్ ఐదేళ్ల పాలనలో పంట కాలవలు, డ్రైన్ల పనులకు రూపాయి ఖర్చు పెట్టలేదు, తట్ట మట్టి పని నోచుకోలేదన్నారు.లాకులు, షట్టర్లు, డోర్స్, రోప్సు వంటి వాటికి మరమ్మత్తుల మాట అటునుంచి, కనీసం గ్రీజు పెట్టి మెయింటినెన్స్ పనులు చేసిన పాపాన పోలేదన్నారు. అందుకు ఉదాహరణ నిదర్శనం లక్ష్మీ పాలెం లాకులని తెలిపారు. ఈ లాకులకు సంబంధించి ఒక తలుపు కొట్టుకుపోవడంతో మీరు వెనక్కు వచ్చి నక్కల మురుగు కాలువలో కలిసి వేలాది ఎకరాలను ముంపు గురి చేయడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాజా అవుట్ ఫాల్స్ స్లూయిజ్ పరిస్థితి ఇంతేనన్నారు. ఆనాడు వైకాపా మంత్రులు ఆర్భాటంగా వచ్చి చూసారే గాని రూపాయి నిధులు మంజూరు చేయలేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవుట్ ఫాల్స్ స్లూయిస్ పనులకు 12 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు పిలవడం జరిగింది అన్నారు. చంద్రబాబు పరిపాలనా దక్షతను 16వ ఆర్థిక సంఘ ప్రతినిధులు సైతం కితాబిచ్చారన్నారు. నాడు జగన్ విచ్ఛిన్నం చేసిన రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు శ్రమిస్తున్నారని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పాలకొల్లు నియోజకవర్గం కన్వీనర్ యర్రంశెట్టి పద్మారావు, డిసిసిబి మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్, దేవళ్ల రామకోటి మోహన్, జిన్నూరు వేడంగి సర్పంచులు జమ్మూ బేబీ మహాలక్ష్మి మృత్యుంజయరావు, శారద పద్మ, దేవరపు దొరబాబు, ఇంటి శ్రీరాములు, కుక్కల సత్యనారాయణ, తుల రామలింగేశ్వర రావు, పితాని వెంకటేష్, దాసరి రత్నరాజు పాలవలస తులసీరావు, భూపతి రాజు సత్యనారాయణ రాజు, గిరిగి గోపాలకృష్ణ, ధనుంజయ్,యరకల శ్రీనివాస్, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు...

## ఆటపాటలతో కూడిన విద్య భాష్యం కే సొంతం -రామాంజనేయులు





**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 21.** ఆటపాటలతో కూడిన ఒత్తిడి లేని విద్య భాష్యం పాఠశాలకే సొంతమని ఆ పాఠశాల ప్రిన్సిపల్ పి పేరయ్య నాయుడు అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం సాంస్కృతిక కార్యక్రమాల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జోనల్ ఇంచార్జ్ రామాంజనేయులు మాట్లాడుతూ గత పదేళ్ల నుండి పాఠశాల ఉత్తీర్ణత శాతం లో ఒక ప్రత్యేకతను సంతరించుకుందని దానికి ప్రధాన కారణం విద్యార్థులు కట్టించి చదవడమేనన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. తమ పాఠశాలలో చదువు పాటు అనేకరకాల ఆటలు విద్యార్థులకు నేర్పిస్తున్నామన్నారు. ఆ కారణంగానే ఈ ఏడాది జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారన్నారు. కార్యక్రమం పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఛాంప్స్ ప్రిన్సిపాల్ షేక్ షబానా, ఉపాధ్యాయులు, వెంకటేశ్వరరావు, సింహాద్రి సుధీష సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గంగవరంలో అన్నదాన కార్యక్రమం





**గంగవరం, పెన్ పవర్ ,ఏప్రిల్ 21:**శ్రీరామనవమి వేడుకలు పురస్కరించుకుని సోమవారం స్థానిక రామాలయం వద్ద భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు సుమారు వెయ్యి మంది భక్తులు అన్నదానం స్వీకరించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలుముల అక్కమ్మ, కమిటీ సభ్యులు శేషాచార్యులు, వెంకటరమణ ,నాగేశ్వరావు, సుబ్రహ్మణ్యం, సాయి వెంకట్, బాబ్జి ,పవన్ రామాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు మొదలయ్యాయి: మంత్రి నిమ్మల

- టిడిపిలో చేరిన 30 మంది వైసిపి నాయకులు
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి రామానాయుడు

**పెనుమంట్ర(పోడూరు), పెన్ పవర్, ఏప్రిల్-21:** టీడీపీ, జనసేన, బీజేపీ (ఎన్డీఏ) కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ఫలాలకు ఆకర్షితులై వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు మొదలయ్యాయని, ఈ పరంపర కొనసాగుతుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
పాలకొల్లు మండలం పాలకొల్లు రూరల్ గ్రామానికి చెందిన పలువురు వైసీపీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. పాలకొల్లులోని మంత్రి కార్యాలయంలో పార్టీలో చేరిన గ్రామ వైసిపి అధ్యక్షుడు అంబటి శేషగిరి తో పాటు మరో 30 మంది కి మంత్రి రామానాయుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీలో చేరి నాయకులంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని మోదీ కలయికతో రాష్ట్ర అభివృద్ధి,సంక్షేమ పథకాలు అమలు జరగడంతోపాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్న రామానాయుడు నాయకత్వాన్ని కోరుకుంటూ టిడిపిలో చేరుతున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పాలకొల్లు మండల కార్యదర్శి పాముల రజనీ కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకుడు సాయిరామ్ మృతి



- ఎమ్మెల్యే బండారు ఘన నివాళులు



**ఆలమూరు, పెన్ పవర్,ఏప్రిల్ 21:**మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘ నాయకుడు నిమ్మకాయల సాయిరామ్(56) సోమవారం ఉదయం రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రస్తుతం ఆయన రావులపాలెం మండలం గోపాలపురం గ్రామపంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 1991లో ఆలమూరు పంచాయతీ రికార్డ్ అసిస్టెంట్ గా ఉద్యోగం చేపట్టిన ఈయన బిల్లు కలెక్టరుగా, జూనియర్ అసిస్టెంట్ గా, కార్యదర్శిగా ఎదుగుతూ గ్రేడ్-1 కార్యదర్శి స్థాయికి చేరుకున్నారు. పెదపళ్ల గ్రామానికి చెందిన సాయిరామ్ ఆలమూరు,చొప్పెల్ల, ఊబలంక,వెదిరేశ్వరం,గోపాలపురం,రావులపాడు తదితర గ్రామపంచాయతీలలో పనిచేస్తూ అందరి మన్ననలను అందుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉంటూ ఎందరో ఉద్యోగులకు అండదండగా ఉన్నారు.ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోదరుడు బ్రహ్మాజీ కపిలేశ్వరం మండలం తాతపూడి కార్యదర్శిగా పనిచేస్తున్నారు.అలాగే సాయిరామ్ తండ్రి పట్టాభిరామయ్య పంచాయతీ ఉద్యోగ సంఘ నాయకులుగా విశేష సేవలు అందించారు.సంగిత వెంకటరెడ్డి మంత్రిగా పనిచేసినప్పుడు ఆయన వద్ద స్థానిక పీఎస్ గా పట్టాభిరామయ్య ఉంటూ గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి విశేష కృషి చేసేవారు.

**ఎమ్మెల్యే బండారు ఘన నివాళులు..**

ఆలమూరులో సాయిరామ్ ఇంటి వద్ద ఆయన భౌతికకాయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండే సాయిరామ్ మృతి బాధాకరమన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా తాను ముందు ఉంటానని ఎమ్మెల్యే బండారు హామీ ఇచ్చారు. అలాగే సాయిరామ్ మృతదేహాన్ని ఇన్చార్జ్ డి ఎల్ పి ఓ ఏ.రాజు, రావులపాలెం ఎంపీడీవో ఇ.మహేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సాయిరామ్ మరణ వార్త తెలియగానే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి వేలాదిగా పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు,బంధుమిత్రులు తరలి వచ్చారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ విలపించారు.ఆలమూరు మండలంలోనే గాక కొత్తపేట నియోజకవర్గంలో సాయిరామ్ మృతి వార్త అందరినీ కలించివేసింది.నియోజకవర్గ కూటమి నాయకులు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఆయన అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష నిర్వహణకు సమగ్ర ఏర్పాట్లు చేపట్టాలి

**జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు**

**కాకినాడ.పెన్ పవర్ ఏప్రిల్ 21 :**మెడికల్ కాలేజిలలో ప్రవేశానికి మే 4వ తేదీన నీట్ పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండ్లను కోరారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మే 4వ తేదీన నిర్వహించ నున్న నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) నిర్వహణకు చేపట్టవలసిన ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఈ పరీక్షల నోడల్ అధికారి కాకినాడ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శేఖర్ తో కలిసి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సమన్వయ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ వెంక్రట్రావు మాట్లాడుతూ మే 4వన తేదీ మద్యాహ్నం 2 నుండి 5 గంటల వరకూ నీట్ పరీక్ష జిల్లా కేంద్రం కాకినాడలో 10 పరీక్ష కేంద్రాలలో ఓఎంఆర్ విధానంలో జరుగుతుందన్నారు.ఈ పరీక్షకు జిల్లాలో 2880 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఎంపిక చేసిన 10 సెంటర్లలో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆయన చీఫ్ సూపరింటెండెంట్లను కోరారు. అన్ని కేంద్రాలకు కాంపౌండ్ వాల్ తప్పని సరిగా ఉండాని, కేంద్రాలన్నిటిలో సిసి కెమేరాలతో నిశిత పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా కేంద్రాలన్నిటిలో త్రాగునీరు, ప్రధమ చికిత్స అందుబాటులో ఉంచాలన్నారు.పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు లేకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులను,పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను కోరారు. పరీక్షల నిర్వహణకు రిగ్యులర్ ఉద్యోగులను మాత్రమే ఇన్విజిలేటర్లుగా నియమించాలని, సైన్స్ బోధనా నేపద్యం కలిగిన వారేవరినీ నియమించకూడదని తెలిపారు.చీఫ్ సూపరింటెండెంట్లూ,వివిధ శాఖల అధికారులు సమన్వయంతో నీట్ పరీక్షను సజావుగా నిర్వహించాలని డిఆర్ఓ కోరారు.



# పల్లెల్లో త్రాగునీరు కు ప్రాధాన్యం ఇవ్వాలి

**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రియల్ 21:**రాష్ట్రంలో మండుతున్న ఎండల దృశ్య ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డి చంద్రశేఖర్ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ పారిశుద్ధ్యం లోపించకుండా చూచుకోవాలని ఎక్కడైనా పైపులైన్లు రక్షిత మంచినీటి పథకాలు పాడై ఉంటే తక్షణ మరమ్మత్తులు చేయించుకోవాలని ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే కార్యాలయం దృష్టికి తీసుకురావాలన్నారు. పథకాలన్నిటిని విధిగా క్లోరినేషన్ చేయాలన్నారు .ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించిన సర్పంచ్ తమ్మన





**ఆలమూరు, పెన్ పవర్,ఏప్రిల్ 21:**ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతిష్టాత్మకమైన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో ఆలిండియా ర్యాంకులు సాధించిన అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని చెముడులంక గ్రామానికి చెందిన అడపా వీర వినోద్, పేరూరి హేమ దుర్గా రామ సురేష్ లను గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ సోమవారం సాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇటువంటి ర్యాంకులను మరెన్నో సాధించి, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన కోరారు. అయనతో పాటుగా గ్రామ వైఎస్ఆర్సిపి ప్రెసిడెంట్ దొండపాటి వెంకటేశ్వరరావు,మాజీ సర్పంచ్ వీర వెంకటరావు,తమ్మన గోపాలకృష్ణ, దొండపాటి శ్రీను, తదితరులు ఉన్నారు.

# పోలవరం నిర్వాసితుల అధ్యయన కమిటీ నాయకులు

- కాంగ్రెస్,మండల అధ్యక్షులు అండిమేని లీలాకృష్ణ





**వి.ఆర్.పురం పెన్.పవర్.ఏప్రిల్.21** గత యాబై సంవత్సరాల నుండి ఇక్కడే జీవిస్తున్న బి.సి.కాలనీ వాసులు,ఎస్.సి.సామాజిక వర్గం వాసులు ప్రతి సంవత్సరం పోలవరం ప్రాజెక్టు కారణంగా వరద నీరు గ్రామంలోనికి రావడంతో తమ తమ పిల్లలతో నానా ఇబ్బందులు పడుతున్నాము.గోదావరి వరదలు సమయంలో బి.సి.కాలనీ వాసులు అందరం కలసి మమ్మల్ని ఇక్కడ నుండి తరలించండి.అంటూ ప్రభుత్వ అధికారులు చూట్టూ తిరుగుతూ మా సమస్యపై వినతి పత్రాలు ఇస్తూ రహదారిపై అనేక పోరాటాలు చేయవలసి వస్తుందని,సోమవారం ఏర్పాటు కాంగ్రెస్,పార్టీ పోలవరం నిర్వాసితుల అధ్యయన కమిటీ కు తమ సమస్యలను బాధలను తెలిపారు.వి.ఆర్.పురం బి.సి కాలనీ వాసులకు పేపర్ నోటిఫికేషన్ ఇప్పించి,స్ట్రక్చర్ వ్యాల్యూ సర్వే చేయించి,మమ్మలను తరలించండి.అంటూ కోరారు.
మండలంలోని వడ్డిగూడెం గ్రామ పంచాయితీకు గత 60 సంవత్సరాలు గా మా గృహాల పన్నులు వడ్డిగూడెం గ్రామపంచాయితీ వారికి చెల్లిస్తున్నాము అయితే మా గృహాలు భూభాగం రేఖపల్లి రెవెన్యూ గ్రామంలో ఉన్నాయని,వడ్డిగూడెం పంచాయితీలో లేవని, అధికారులు చెబుతున్నారు.41:15 కాంటూరులో సగం మాత్రమే ముంపులో ఉన్నది.సగం లేదు.అంటున్నారు. పోలవరం ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు వడ్డిగూడెం గ్రామ పంచాయితీలొ ఉన్న అన్ని గ్రామలకు పేపర్ నోటిఫికేషన్ ఇచ్చియున్నారు.కానీ అదే పంచాయితీ పరిదిలో ఉన్న వి.ఆర్.పురం బి.సి కాలనీలోని 209 కుటుంబాలను నోటిఫికేషన్లో చేర్చలేదు.వి.ఆర్.పురం బి.సి కాలనీ మొత్తం కుటుంబాల సంఖ్య 209 అయితే ఈ కుటుంబాలలో 111 కుటుంబాలు లేడార్ సర్వేలో ఉన్నాయని,మిగిలిన 98 కుటుంబాలు లేడార్ సర్వేలో లేవని,అధికారులు చెబుతున్నారు.రేఖపల్లి రెవెన్యూ గ్రామానికి సంబంధం లేకుండా మా వి.ఆర్.పురం బి.సి కాలనీలోని 111 కుటుంబాలు 98 కుటుంబాలను మొత్తం 209 కుటుంబాలను ఒకే యూనిట్,గా చేసి 41.15 కాంటూరులొ చేర్చి 209 కుటుంబాలకు పేపర్ నోటిషికేషన్ ఇప్పించి వి.ఆర్.పురం గ్రామంతో పాటు స్ట్రక్చర్ వ్యాల్యూ సర్వే చేయించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం పోలవరం నిర్వాసితుల అధ్యయన కమిటీ కు ఒక వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అండిమేని లీలాకృష్ణ,పోలవరం నిర్వాసితుల అధ్యయన కమిటీ నాయకులు బింగి విష్ణుమూర్తి,మోదుగు వెంకన్నబాబు,గడ్డం కృపారావు,మోదుగు నాగేశ్వరరావు,గడ్డం సుధాకర్,ములకలపల్లి సరోజిని,గడ్డం ప్రవీణ్ కుమార్,ముయ్యటి నాగమణి,ములకపల్లి గంగమ్మ, మోదుగు ఆదిలక్ష్మి,కోట్ల శ్రీనివాసరావు,బి.సి.కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు సత్కారం



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రియల్ 21:**రాష్ట్ర స్థాయి జాతీయస్థాయి క్రీడా పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేసిన సర్పంచ్ మెర్ల రాము . మండలంలో మెర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతియస్థాయి నెట్ బాల్,త్రోబాల్ పోటీలలోను రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ ను కనబరిచారు.సోమవారం పాఠశాల ఆవరణలో పాఠశాల కమిటీ చైర్మన్ పువ్వల లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ మెర్ల రాము ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులకు ఘనంగా సత్కరించారు. పోటీల్లో విశేష ప్రతిభ ను కనబరిచిన క్రీడాకారులకు దాతలు విరాళాలుతో సమకూర్చిన బహుమతులను,అందజేసి శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మల్లవరపు నాగరాజు, మెర్ల లక్ష్మీపతి గోపా మనోహర్, ఎలిపే వీర్రాజు, రంకిరెడ్డి వినయ్ కుమార్, మెర్ల రామంజనేయులు, నాని మెర్ల సంజు, మెర్లర్ల సూరన్న, పాఠశాల హెచ్ ఎం శ్రీహరి, పిఈటి శ్రీకాంత్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ అనంతబాబుకు ఉచ్చు

**కాకినాడ. ఏప్రిల్ 21 పెన్ పవర్:** తన దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న దళిత కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ను హత్య చేసి ఆపై డోర్ డెలివరీ చేసిన సంఘటన పై ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.. దీనిపై తమకు ఇంకా సరైన న్యాయం జరగలేదంటూ మృతుడి కుటుంబికులు ఎన్నికలకు ముందు చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై న్యాయ విచారణ చేపట్టి న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఈ సంఘటనపై న్యాయ విచారణకు ఆదేశించింది.. కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం రంపచోడవరంకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు.. చాలా కాలంగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం మానేశాడు.. ఇదిలా ఉంటే 2022 మే 19న ఇంటి నుంచి వెళ్లిన సుబ్రహ్మణ్యం తిరిగి రాలేదు. అయితే తెల్లవారు జామున ఓ కారులో గుర్తు తెలియని వ్యక్తి సుబ్రహ్మణ్యం మృతదేహం తీసుకొచ్చి వదిలి వెళ్లిపోయాడు. ఈ సంఘటన అప్పట్లో తీవ్ర సంచలనం రేకెత్తించింది. దళిత సంఘాలు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి.. అయితే వైసీపీ ప్రభుత్వం నిందితున్ని కాపాడుతోందని ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి.. ఈక్రమంలోనే అత్యంత దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబు పై కాకినాడ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అప్పట్లో పోలీసుల వైఖరిపై తీవ్రస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు ఎమ్మెల్సీ అనంతబాబును అరెస్ట్‌చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు పోలీసులు.. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అలియాస్ అనంత బాబు డోర్ డెలివరీ కేసులో న్యాయ విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ న్యాయ విచారణలో ప్రాసిక్యూషన్ కు సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ మరియు మానవ హక్కుల రక్షణ కోసం సుదీర్ఘంగా పోరాటం



చేస్తున్న ముప్పాళ్ళ సుబ్బారావును నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 538 ని విడుదల చేసింది. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ముప్పాళ్ళ సుబ్బారావు అండగా నిలిచారు. వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయస్థానాల్లో పోరాటం చేసేందుకు నేనున్నానంటూ నిలబడ్డారు. ముప్పాళ్ళ సుబ్బారావు మడమతిప్పని పోరాటం వల్ల ఎమ్మెల్సీ అనంత బాబుకు స్థానిక న్యాయస్థానాల్లో బెయిల్ లభించలేదు. చివరికి సుప్రీంకోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం అనంత బాబు బెయిల్ పై ఉన్నారు. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితులు తప్పించుకునే విధంగా పోలీసులు చార్చిషీట్ రూపకల్పన చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.. హత్య సంఘటన అనంతరం 88 రోజులకు దాఖలు చేసిన చార్చిషీట్‌ను అప్పట్లో న్యాయ స్థానం తిరస్కరించింది. అందులో సాంకేతి ఆధారాలు, నిందితుల కదలికలు తదితర అంశాలు లేకుండా చార్జిషీట్‌లో లేకపోవడమే తిరస్కరణకు కారణమని బాధితుల తరపున వాదించిన న్యాయవాది సుబ్బారావు వెల్లడించారు. 2023 ఏప్రిల్ 14న అనుబంధ చార్జిషీట్‌ను వేశారు. గడువులో దాఖలు చేయకుండా నిందితుడుకు బెయిల్ వచ్చేవిధంగా అప్పటి ఎస్పీ, డీఎస్పీ ఆలస్యం చేశారని విమర్శలున్నాయి.. అప్పట్లో తానే హత్యచేశానని విచారణలో ఎమ్మెల్సీ అనంతబాబు అంగీకరించినట్లు మీడియా సమావేశంలో ఎస్పీ వెల్లడించారు కూడా.. చార్చిషీట్ ఆలస్యం వల్లనే మధ్యంతర బెయిల్ వచ్చిందని దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే మృతుడి తల్లితండ్రులు నూకాలమ్మ,సత్యనారాయణలు మాత్రం మూడేళు ్లగా న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ కేసును రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం జరిగేలా విచారణకు ఆదేశిస్తారని భావిస్తూ వచ్చారు. సరిగ్గా ఇప్పుడు అదే జరిగింది. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసులో ప్రత్యేక కౌన్సిల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక న్యాయవాదిగా మంచి ట్రాక్ రికార్డు కలిగిన ముప్పాళ్ళ సుబ్బారావును ఈ కేసులో సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా నియమించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్సీ అనంత బాబు కేసులో న్యాయం గెలుస్తుందన్న నమ్మకం ఇప్పుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబంతో పాటు దళితుల్లోనూ కలుగుతోందంటున్నారు..

# కారుమూరి మెడకు 690 కోట్ల టీడీఆర్ స్కాం

**ఏలూరు. ఏప్రిల్ 21 పెన్ పవర్:**
ఈ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొత్తం 754 కోట్ల రూపాయల విలువచేసే బాండ్లు జారీ చేస్తే అందులో దాదాపు 691 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఏలూరు జిల్లా వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన చేసిన హాట్ కామెంట్స్ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్నాయి. ఆయన చేసిన కామెంట్స్ కూటమి ప్రభుత్వంతో పాటు మళ్ళీ పాత కేసులను బయటకు తోడేలా చేసేయంటూ టాక్ విన్పిస్తోంది.ఇటీవల ఎంపీపీ ఎన్నికల సమయంలో టిడిపి నాయకులు చేసిన వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో వైసిపిపై దాడులు చేస్తే మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు వరకు ఇంటి నుండి బయటకు లాగి కొడతామనీ, గుంటూరు తర్వాత నరికి చంపేస్తామని కారుమూరి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీలో పెను దుమారాన్నే రేపుతున్నాయి. ఈ కామెంట్స్ పై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కూటమి నేతలంతా తీవ్రంగా స్పందించారు. తణుకు నియోజవర్గంలో కొందరు టిడిపి నాయకులు కారుమూరి వల్ల తమకు ప్రాణహాని ఉందంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేశారు.ఎప్పుడు సైలెంట్ గా ఉండే కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సైతం కారుమూరి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసాపురంలో జరిగిన సభలో మాట్లాడుతూ%ౌ%రాజకీయ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్న హెచ్చరించిన వర్మ%ౌ%ఆ తర్వాత పాలకొల్లు నియోజకవర్గంలో జరిగిన సభలో మాత్రం కారుమూరిపై అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ఎన్డీఏ కూటమి పార్టీల కార్యకర్తల జోలికి వస్తే చేతులు, కాళ్లు నరికేస్తానంటూ కేంద్రమంత్రి ఘాటుగా వ్యాఖ్యలు చేశారు.ఎవరినైనా చంపడానికి చేతులు లేకుండా, నడవడానికి కాళ్లు లేకుండా చేస్తానంటూ కారుమూరిని హెచ్చరించారు. %ణ=% బాండ్ల



స్కాంలో వందల కోట్లు అవినీతి చేసిన కారుమూరి నాగేశ్వరరావు త్వరలో జైలుకెళ్లడం ఖాయం అన్నారు. అయితే వర్మ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఇక కారుమూరి నాగేశ్వరరావు జైలుకి వెళ్లడం తప్పుదంటూ రకరకాల టాక్స్ పొలిటికల్ సర్కిల్స్ లో విన్పిస్తున్నాయి. నెక్ట్స్ లిస్టులో కారుమూరి పేరు ఉందంటూ ఇప్పుడు అంతా చర్చించుకుంటున్నారట.%ణ=% బాండ్ల స్కాంలో వందల కోట్లు అవినీతికి కారుమూరి పాల్పడ్డారంటూ కేంద్ర మంత్రి వర్మ చేసిన కామెంట్లు ఇప్పుడు హాట్ టాపిగ్గా మారాయి. టీడీఆర్ బాండ్ల స్కాంలో అసలేం జరిగిందంటూ ఇప్పుడు అంతా ఆరా తీస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కారుమూరి..తన సొంత నియోజకవర్గమైన తణుకు పట్టణంలో అభివృద్ధి పేరుతో భారీ ఎత్తున సేకరించిన భూములపై ప్రస్తుత తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ ఆరా తీస్తున్నారంట.తణుకు మున్సిపాలిటీలో టీడీఆర్ బాండ్ల స్కాంపై ఇప్పటికే ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. వాస్తవానికి 2014 నుండి 19 వరకు అప్పటి తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ తణుకు పట్టణ అభివృద్ధి కోసం 6వేల గజాలకు బాండ్లు ఇచ్చారు. అయితే 2019 నుండి 24 వరకు అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావు ఏకంగా 6 లక్షల గజాల వరకూ బాండ్లు ఇవ్వడంతో తీగలాగితే డొంక కదిలింది అన్నట్లు రాష్ట్రంలోనే భారీగా టీడీఆర్ బాండ్స్ స్కాం బయటపడేందుకు కారణమైందట.ఈ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొత్తం 754 కోట్ల రూపాయల విలువచేసే బాండ్లు జారీ చేస్తే అందులో దాదాపు 691 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇప్పటికే ఏసీబీ విచారణ పూర్తయిందని..త్వరలోనే నివేదికను ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉందట. అయితే ఏసీబీ నివేదికలో కారుమూరి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే ఆయన జైలుకెళ్లడం తప్పదనే చర్చ జరుగుతోంది. అయితే ఏసీబీ సమర్పించే నివేదికలో ఏముందనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# పెద్దిరెడ్డికి టీడీపీ నేతల అండలు...?

**తిరుపతి, ఏప్రిల్ 21, పెన్ పవర్:**
ఏంటో వీళ్లు పట్టించుకోవడం లేదా.. లేక చేతకావడం లేదా.. లేక క్యాష్ కొట్టినోడిని క్షమించేస్తున్నారా.. ఇదే కూటమి ప్రభుత్వంపై ఆ పార్టీల కార్యకర్తలే విసురుతున్న మాటలు. మొదటి ఆరు నెలలు అయితే ఏకిపారేశారు. తర్వాత కాస్త కేసులు ఒక్కోరిపై పెడుతున్న కొద్దీ .. కొంచెం కొంచెం చల్లబడ్డారు. కాని ఆ కేసులు నడుస్తున్న తీరు చూసి మళ్లీ ఫైరవుతున్నారు. అదేమంటే టీడీపీ నేతలేమో మేం పద్ధతిగా వెళుతున్నాం.. వైసీపీలాగా అరాచకంగా, కక్షగట్టి చేయం అంటూ సుభాషితాలు చెబుతున్నారు. లేటెస్టుగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వ్యవహారంలో ప్రభుత్వంపై ఇలాంటి విమర్శలే వస్తున్నాయి.హైకోర్టు ముందస్తు బెయిల్ ఇస్తే.. సుప్రీంకోర్టులో కేవియెట్ ఎందుకు వేయలేదని.. అసలు బెయిల్ ఇచ్చే సమయంలో ప్రభుత్వం తరపు లాయర్ సరిగా వ్యవహరించలేదని.. సోషల్ మీడియాలో కూటమి కార్యకర్తల మధ్యే పెద్ద వార్ నడుస్తుంది. సమర్ధించుకునేవారు కొందరు.. ప్రశ్నించేవారు మరికొందరు.. మొత్తం మీద రచ్చ నడుస్తోంది. ఇప్పుడు మిథున్ రెడ్డి లిక్కర్ స్కామ్ కేసులో విచారణకు హాజరవుతున్నారు. తన విచారణను లాయర్ల సమక్షంలో చేయాలని.. వీడియో రికార్డింగ్ చేయించాలని హైకోర్టులో పిటిషన్ వేశారు మిథున్ రెడ్డి. దీనిపై కూడా ప్రభుత్వం తరపు లాయర్లు సరిగా వాదించలేదనేదే విమర్శ. అసలు పెద్దిరెడ్డి ఫ్యామిలీతో కుమ్మక్కయ్యారా అంటూ సోషల్ మీడియాలో సర్క్యులేషన్ నడుస్తోంది.ఇక్కడ సమస్య ఏంటంటే%ౌ% కేసులు ఎదుర్కొంటున్న వైసీపీ పార్టీ నేతలంతా క్యాష్ పార్టీలే. మామూలు క్యాష్ పార్టీలు కాదు%ౌ% ఎవరిని కొట్టాలన్నా



క్యాష్ తోనే కొట్టే బ్యాచ్. క్యాష్ కొడితే దెబ్బ తగిలినా నవ్వుతూ తీసుకునే బాపతు మన వ్యవస్థలో చాలా ఎక్కువ మంది ఉన్నారు. పోలీసులు, లాయర్లు, అధికారులు.. అన్ని చోట్లా ఈ కల్చర్ ఉంది. బోరుగడ్డ అనిల్ విషయంలో అదే జరిగింది. పోలీసులు డబ్బులు తీసుకుని వాడికి రాచమర్యాదలు చేశారు.. ఆ వీడియోలు బయటకు రావడంతో జాగ్రత్తపడ్డారు. ఆఖరికి బోరుగడ్డ బెయిల్ కోసం పెట్టిన పేపర్లు కూడా ఫేక్ అని హైకోర్టు తేల్చింది కాని.. పోలీసులు కాదు.అంతెందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై భూకబ్జా ఆరోపణలు ఎన్ని వచ్చా యి? అటవీ భూములు, అసైన్డ్ భూములు ఆక్రమించినట్లు కంప్లయింట్లు చాలామంది చేశారు. మదనపల్లి తహశీల్దార్ ఆఫీసులో అగ్ని ప్రమాదం జరిగితే హెలికాప్టర్ లో అధికారు లను పంపిన ప్రభుత్వం.. తర్వాత మాత్రం దాని గురించి పెద్దగా పట్టించుకున్నది. నెలల తర్వాత పెద్దిరెడ్డికి నోటీసులు ఇవ్వడానికి వెళ్లారు.. ఆయన లేరని వెనక్కి వచ్చేశారు. అలా నడుస్తోంది వ్యవహారం. అసలు భూములు ఆ రేంజులో కొట్టేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని.. అది కూడా ఆయన భార్య పేరు మీద డాక్యుమెంట్లు దొరికాక కూడా .. ఆయనను టచ్ చేయకపోవడం ఎలాంటి సిగ్నల్స్ ఇస్తుందని కొందరు ప్రశ్నిస్తున్నారుపెద్దిరెడ్డి కుటుంబం వరకు టీడీపీలోనే ఓ పెద్ద ఫ్రెండ్ ఉన్నాడన్నది చాలామందికి తెలుసు. ఆయనో టీడీపీ అనుకూల మీడియా అధినేత. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆయన చానెల్ లో పెద్దిరెడ్డిపై ఈగ వాలనివ్వలేదు. ఇక కూటమి వచ్చాక ఆయనను కాపాడే లాబీయింగ్ నడిపించారని ప్రచారం జరుగుతోంది. అయితే మరో పెద్ద టీడీపీ అనుకూల మీఢియా ఈ విషయం తెలిసి%ౌ% పెద్దిరెడ్డిని టార్గెట్ చేసి వార్తలు వరుసగా ఇచ్చింది. దీంతో అందరూ అది ఇవ్వక తప్పలేదు.. ప్రభుత్వం, అధికారులు స్పందించక తప్పలేదు. కాని పెద్దిరెడ్డి ఫ్రెండ్ లాబీయింగ్ గట్టిగానే పని చేస్తున్నట్లు ఉంది. అందుకే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టచ్ చేయడం ఇంకా లేటు అవుతుంది.ఎందుకంటే ఈ స్కామ్ లో జగన్ ను అరెస్ట్ చేయడమే కూటమి ప్రభుత్వ టార్గెట్. అందుకే అలా జరుగుతోంది. లేదంటే మిథున్ రెడ్డిని కూడా పెద్దాయన రామచంద్రారెడ్డి కోరిక మేరకు వదిలేసేవారేమో. ఏమైనా క్యాష్ కొడితే ఎలాంటివాడినైనా వదిలేస్తారు అనే నానుడి మాత్రం కూటమి ప్రభుత్వంలో గట్టిగా వినిపిస్తోంది. కాకపోతే క్రిమినల్ కేసులు మాత్రమే దానికి మినహాయింపు. అందులోనూ కొందరు నేతలకు మాత్రమే ఆ మినహాయింపు. మరి తప్పు చేసిన వైసీపీ నేతలకు శిక్షలు వేయించి తన ప్రాతివత్యం టీడీపీ నిరూపించుకుంటుందో లేదో చూడాలి మరి

# ఏపీలో స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు

**విజయవాడ. ఏప్రిల్ 21 పెన్ పవర్:** రోడ్డుపై నడిచి వెళ్తున్నప్పుడూ లేదా వాహనాల్లో వెళ్తున్నప్పుడు రోడ్డుపక్కన వీధి వ్యాపారులను మనం గమనిస్తూనే ఉంటాం. తినుబండారాల దగ్గర నుంచి వస్తువుల వరకూ విక్రయిస్తూ ఉంటారు. పొట్టకూటి కోసం రహదారుల పక్కన, తోపుడు బండ్ల మీద చిరువ్యాపారులు.. తమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ ఉంటారు. కూటి కోసం కోటి కష్టాలు అన్నట్లుగా వారి ఇబ్బందులు వారివి. అయితే వీధి వ్యాపారుల కారణంగా అప్పడప్పుడూ రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతూ ఉంటుంది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ నేపథ్యంలో వారి జీవనోపాధి దెబ్బతీయకుండా.. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు అమలు చేస్తోంది.పట్టణాల్లో రద్దీని నియంత్రించేందుకు, వీధి వ్యాపారులకు పరిశుభ్రమైన వ్యాపార పద్ధతులు అలవాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును తీసుకువచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ 2013లో ఈ స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును ప్రారంభించింది. స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు కింద వీధి వ్యాపారులకు కంటైనర్ షాపులు నిర్మించి ఇవ్వనున్నారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 200 కంటైనర్ షాపులు నిర్మించి వీధి వ్యాపారులకు అందించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నెల్లూరు మైపాడు రోడ్డులో పైలట్ ప్రాజెక్టుగా స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇప్పుడు శ్రీకాకుళంలోని కొత్తవంతెన రహదారిలోవీధి వ్యాపారులకు కంటైనర్లు నిర్మించి ఇవ్వనున్నారు.పట్టణాలు, నగరాల్లో రోడ్ల పక్కన ఆహార పదార్థాలు, వ్యాపారాలు చేసేవారికి స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు కింద కంటైనర్లు కేటాయిస్తారు. 18 ఏళ్లు పైబడి ఉండాలి. అలాగే స్థానిక సంస్థలో వివరాలు నమోదు చేసుకుని ఉండాలి. అర్హులకు స్ట్రీట్ వెండర్స్ కమిటీ ద్వారా అందరి సమక్షంలోనే ఈ కంటైనర్ దుకాణాలు కేటాయిస్తారు. ఒకే రకమైన ఆహార పదార్థాలు, ఉత్పతులు విక్రయించేవారికి వీటిని కేటాయిస్తారు. ఈ కంటైనర్ దుకాణాలలో అవసరమైన అన్నిరకాల మౌలిక సదుపాయాలు, రూఫ్ టాప్ సీలింగ్, సోలార్ విద్యుత్తు, ఉచిత వైఫై, అధునాతన ఫర్నీచర్ ఉంటాయి. అలాగే ఆహార పదార్థాల తయారీ, మార్కెటింగ్‌పైనా ప్రత్యేక శిక్షణ అందిస్తారు.

# వేగంగా గిరిజన వర్శిటీ పనులు

**విజయనగరం. ఏప్రిల్ 21 పెన్ పవర్:** కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణం పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సహకరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినవలసలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోంది. కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.వీ. కట్టిమణి, డీన్ ప్రొఫెసర్ ఎం.శరత్ సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనులు, తాజా పరిస్థితులపై వారితో సీఎం చంద్రబాబు మాట్లాడారు.గిరిజన వర్సిటీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.800 కోట్లు కేటాయించింది. అందులో ఇదివరకే రూ.340 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. మొత్తం 561 ఎకరాల గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో అడ్మిన్ బిల్డింగ్‌తో పాటు వసతి భవనాలు, అకడమిక్ బ్లాక్స్ నిర్మాణం జరుగుతోంది. ఈ పనులు వేగవంతం చేయాలని వీసికి సీఎం చంద్రబాబు సూచించారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. నిర్మాణాల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వ పరంగా పూర్తిగా సహకరిస్తామని చంద్రబాబు వర్సిటీ వీసికి చెప్పారు. యూనివర్సిటీకి తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, అప్రోచ్ రోడ్ పనులను త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వేగంగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. వర్సిటీకి 2 కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్ పనులు పూర్తి చేయాలని వీసి చెప్పగా... ఆ పనులు వెంటనే ప్రారంభిస్తామని చంద్రబాబు అన్నారు. 100 మంది టీచింగ్ స్టాఫ్ అవసరం కాగా, ప్రస్తుతం కేవలం 18 మంది మాత్రమే ఉన్నారని అధికారులు తెలిపారు. సిబ్బందిని మరింత పెంచాల్సిందిగా కోరుతూ ప్రధాని మోదీకి లేఖ రాస్తానన్నారు సీఎం చంద్రబాబు. మే నెలలో నిర్వహించే యూనివర్సిటీ స్నాతకోత్సవానికి రావాల్సిందిగా కోరుతూ ప్రధాని మోదీకికి లేఖ రాస్తామని సీఎం చంద్రబాబు అన్నారు.2018లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అయింది. అప్పటి నుంచి అద్దె భవనాల్లో విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వర్సిటీ నిర్మాణ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఏదీ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వర్సిటీ నిర్మాణంపై మరోసారి దృష్టిసారించింది. ప్రస్తుతం 600 మంది విద్యార్థులు వివిధ కోర్సులు చదువుతుండగా.. సొంత భవనాలు పూర్తయితే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుంది. ఉద్యోగం సాధించేలా, నైపుణ్యం పెంచేలా బోధన ఉండేలా చూడాలని సీఎం చంద్రబాబు గిరిజన యూనివర్సిటీ అధికారులను కోరారు. ప్రస్తుత సమాజ అవసరాలకు అనుగుణంగా, ఉద్యోగాల సాధన దిశగా కోర్సులను అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# బీసీ సభలో ఓసీ నాయకుడు హవా

**విజయవాడ. ఏప్రిల్ 21 పెన్ పవర్:** సజ్జల ఈజ్ బ్యాక్.. అవును కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్న సజ్జల ఇప్పుడు మీడియా ముందుకొచ్చారు. ఆయన కమ్ బ్యాక్ కోసం వైసీపీ ఏకంగా ఓ సభ పెట్టుకున్నట్టు తెలుస్తోంది. అయితే ఆ సభ బీసీలది. మరి బీసీ సభలో ఓసీ నాయకుడు సజ్జల ఎందుకు అనే అనుమానం అందరికీ రావడం కామన్. సభ బీసీలది అయినా వైసీపీలో బీసీల తరపున మాట్లాడే నాయకులెవరూ లేరని కాబోలు సజ్జలని తెరపైకి తెచ్చారు. ఆయనతోనే ఉపన్యాసం ఇప్పించారు. వైసీపీ బీసీల పార్టీ అని చెబుతూ.. బీసీలకు పెద్దగా మాట్లాడే ఛాన్స్ ఇవ్వకుండా సజ్జలే లీడ్ తీసుకోవడం ఇక్కడ విశేషం. దీంతో టీడీపీ నేతలు ఓ రేంజ్ లో ట్రోలింగ్ మొదలు పెట్టారు. వైసీపీలో బీసీ నేతల పరిస్థితి ఏంటో ఈ సభతోనే అర్థమైపోయిందని అంటున్నారు టీడీపీ నేతలు.ఇటీవల కొంతకాలంగా సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో కనపడ్డంలేదు. సహజంగా జగన్ ఎక్కడుంటే ఆయన కూడా అక్కడ ఉండాలి. కానీ ఆయన లేకుండానే జగన్ నాలుగైదు సార్లు జనంలోకి వచ్చారు. పార్టీ ఆఫీస్ లో కూడా మీటింగ్ లు జరిగాయి. సజ్జల లేకపోవడంతో చాలామందికి చాలా అనుమానాలొచ్చాయి కానీ, ఆయన ఇప్పుడు సడన్ ఎంట్రీ ఇవ్వడం విశేషం. ఇటీవల పొలిటికల్ అఫైర్స్ కమిటీ నాయకత్వం కూడా సజ్జలకే జగన్ అప్పగించడం మరో విశేషం. దీంతో జగన్ వద్ద ఆయన ప్రయారిటీ ఏమాత్రం తగ్గలేదని రుజువైంది.అధికారంలో ఉన్నప్పుడు సకల శాఖల మంత్రి అనే అపవాదు మోశారు సజ్జల. పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామందికి ఆయన టార్గెట్ అయ్యారు. కొందరు బయటపడి మాట్లాడేశారు, మరికొందరు సైలెంట్ గా ఉన్నారు. ఇంకొందరు ఏకంగా పార్టీ నుంచి బయటకొచ్చేసి కోటరీ అంటూ కేకలు వేశారు, కానీ ఫలితం లేదు. జగన్ మాత్రం సజ్జలపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. పార్టీ వ్యవహారాల్లో ఆయనకు పెద్దపీట వేశారు. ఇక తాజాగా బీసీ మీటింగ్ కూడా సజ్జల నేతృత్వంలోనే జరిగింది.వైసీపీ బీసీ సెల్ మీటింగ్ కి మాజీ మంత్రులు జోగి రమేష్, ధర్మాన కృష్ణదాస్, కారుమూరి నాగేశ్వరరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్ సహా అన్ని జిల్లాలనుంచి బీసీ నేతలు హాజరయ్యారు. అయితే కీలక ఉపన్యాయం మాత్రం సజ్జలదే. బీసీలంటే బ్యాక్ బోన్ క్యాస్ట్ అనే విషయాన్ని జగన్ నిరూపించారని అన్నారు సజ్జల. వైసీపీ నేతలు ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేయాలని, పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని సూచించారు. గతంలో కంటే మెరుగ్గా పూర్తిస్థాయి కమిటీలను ఈసారి నియమించుకుందామని అన్నారాయన. విశాఖలో బీసీ మహిళను మేయర్ పీఠం నుంచి తప్పించారని విమర్శించారు.అంతా బాగానే ఉంది కానీ సజ్జల రీఎంట్రీ కోసం బీసీ మీటింగ్ ని ఎంచుకోవడం హాస్యాస్పదం అంటున్నారు టీడీపీ నేతలు. బీసీ పార్టీ అంటే టీడీపీయేనని, బీసీలకు అవకాశాలిచ్చి, నేతలుగా ఎదిగే తోడ్పాటునిచ్చింది, ఇస్తోంది కూడా టీడీపీయేనని చెప్పారు. బీసీల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని వారు కౌంటర్లిచ్చారు.

### స్ట్రాటజీ అంటే ఇదే మరి: ప్లే ఆఫ్స్‌కు చేరుకున్నా..

# మాకు ఇంకో లక్ష్యం ఉంది: ధోనీ





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో ఐదు సార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ కథ ముగిసినట్టే కనిపిస్తుంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ప్లే ఆఫ్స్ కు వెళ్లే అవకాశాలు లేవు. ఈ సీజన్ లో అత్యంత ఘోరంగా ఆడిన జట్లలో చెన్నై సూపర్ కింగ్స్ ఒకటి. తొలి మ్యాచ్ లో సొంతగడ్డపై గెలిచి గ్రాండ్ గా సీజన్ ను ఆరంభించినా ఆ తర్వాత వరుస పరాజయాలు ఆ జట్టును కృంగదీశాయి. దీనికి తోడు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరం కావడం వారికి అతి పెద్ద మైనస్. గైక్వాడ్ లేకపోవడంతో చెన్నై ప్రస్తుతం ధోనీ నడుస్తున్నాడు. ప్రస్తుతం చెన్నై సూపర్ కింగ్స్ మొత్తం 8 మ్యాచ్ ల్లో ఆడితే రెండు విజయాలు మాత్రమే సాధించింది. ఒక జట్టు ఐపీఎల్ ప్లే ఆఫ్స్ కు సాధించాలంటే 8 మ్యాచ్ ల్లో విజయం తప్పనిసరి. 7 మ్యాచ్ లు గెలిచినా వెళ్లాలంటే అదృష్టం కలిసి రావాలి. చెన్నై ఈ సీజన్ లో మరో 6 మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఈ ఆరు మ్యాచ్ ల్లో గెలిస్తేనే ఆ జట్టు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధిస్తుంది. ఒక్క మ్యాచ్ ఓడిపోయినా టోర్నీ నుంచి 99 శాతం నిష్క్రమిస్తుంది. ఆదివారం (ఏప్రిల్ 20) ముంబై ఇండియన్స్ తో ఓడిపోయిన తర్వాత చెన్నైకి ఈ పరిస్థితి వచ్చింది. ఏకపక్షంగా జరిగిన ఈ మ్యాచ్ లో 177 పరుగుల లక్ష్యాన్ని ముంబై మరో 26 బంతులు మిగిలి ఉండగానే ఛేజ్ చేసింది. మ్యాచ్ తర్వాత ధోనీ మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేశాడు. " మొదట మా లక్ష్య ప్లే ఆఫ్స్ వెళ్లేందుకు ప్రయత్నించడం. ఒకవేళ ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించకపోతే.. వచ్చే సీజన్ కు మంచి ప్లేయింగ్ 11 తయారు చేయడం మీద దృష్టి పెడతాం". అని ధోనీ అన్నాడు. ధోనీ మాటలను బట్టి చూస్తే ఈ సీజన్ లో చెన్నై యంగ్ ప్లేయర్లకు ఎక్కువ అవకాశాలను ఇవ్వనున్నట్టు తెలుస్తుంది. ఆయుష్ మాత్రే, షేక్ రషీద్ ఆడిన తొలి మ్యాచ్ లో రాణించారు. వీరి మీద ఎక్కువ దృష్టి పెట్టి మంచి ప్లేయర్లుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయొచ్చు.

వాంఖడే వేదికగా ఆదివారం (ఏప్రిల్ 20) చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టింది. భారీ ఛేజింగ్ లో స్టార్ బ్యాటర్లు సూర్య కుమార్ యాదవ్(30 బంతుల్లో 68: 6 ఫోర్లు, 5 సిక్సర్లు), రోహిత్ శర్మ(45 బంతుల్లో 76: 6 సిక్సర్లు, 4 ఫోర్లు) చెలరేగడంతో ముంబై సునాయాస విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఛేజింగ్ లో ముంబై 15.4 ఓవర్లలో వికెట్ కోల్పోయి 177 పరుగులు చేసి గెలిచింది.

## ఆ ఒక్కడికే అన్యాయం: సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తప్పించిన ఐదుగురు క్రికెటర్లు వీరే!






**హైదరాబాద్ పెన్ పవర్:** 2024-25 సీజన్?కు గానూ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టుకు ఎంపికైన క్రికెటర్ల జాబితాను విడుదల చేసింది. కాంట్రాక్ట్ జాబితాలో మొత్తం 34 మంది ఆటగాళ్లను నాలుగు వేర్వేరు గ్రేడ్‌లుగా విభజించారు. ఈ సారి సెంట్రల్ కాంట్రాక్ట్ లో మొదటి సారి ఐదుగురు ఆటగాళ్లకు చోటు కల్పించిన బీసీసీఐ.. మరో ఐదుగురు క్రికెటర్లను ఈ లిస్ట్ నుంచి తొలగించింది. రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ , జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా.. గ్రేడ్ %ఝ%ం కేటగిరిని నిలుపుకోగా..రిషబ్ పంత్ గ్రేడ్ బి నుంచి గ్రేడ్ ఏ కు ప్రమోట్ అయ్యాడు. గత ఏడాది సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి శ్రేయాస్ అయ్యర్, కిషాన్ లకు సెంట్రల్ కాంట్రాక్ట్ లో బీసీసీఐ చోటు కల్పించింది.

**సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా నుంచి తప్పించిన ఐదుగురు ఆటగాళ్లు వీరే:**

1) అవేష్ ఖాన్: టీమిండియా యంగ్ ఫాస్ట్ బౌలర్ అవేష్ ఖాన్ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా నుంచి తప్పించడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. టీమిండియా తరపున అవకాశం వచ్చిన ప్రతిసారి పర్వాలేదనిపిస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ లోనూ ఆవేశ్ ఖాన్ అద్భుతంగా రాణిస్తున్నప్పటికీ అతడి పేరును తొలగించడం దురదృష్టకరం. చివరిసారిగా 2024 నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్ లో టీమిండియా తరపున ఆడాడు. 2022లో అరంగేట్రం చేసిన ఆవేష్ ఖాన్.. ఇప్పటివరకు 8 వన్డేలు, 25 టీ20 మ్యాచ్ లాడాడు.

2) శార్దుల్ ఠాకూర్: శార్దూల్ ఠాకూర్ డిసెంబర్ 2023లో టీమిండియా తరపున చివరిసారిగా ఆడాడు.గాయం కారణంగా 2024 లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. గాయం నుంచి కోలుకొని రంజీ ట్రోఫీ ఆడిన శార్దూల్ తనకు తాను నిరూపించుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ లోనూ అద్భుతంగా రానిస్తున్నాడు. 2024 లో భారత్ తరపున ఒక్క మ్యాచ్ ఆడకపోవడం కారణంగానే ఈ ఆల్ రౌండర్ కు కాంట్రాక్ట్ లిస్ట్ లో చోటు దక్కించుకోలేకపోయాడు.

3) రవిచంద్రన్ అశ్విన్: డిసెంబర్ 2024లో బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టెస్ట్ తర్వాత భారత ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఒక ప్లేయర్ రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత సెంట్రల్ కాంట్రాక్ట్ లో భాగం కాలేదు. ఈ కారణంగానే అశ్విన్ కాంట్రాక్ట్ జాబితా నుండి తొలగించబడ్డాడు.

4) జితేష్ శర్మ: జితేష్ శర్మ కాంట్రాక్ట్ జాబితా నుండి తొలగించబడటం ఊహించిందే. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ జనవరి 2024 నుంచి టీమిండియా తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. పేలవ ఫామ్ తో భారత జట్టులో స్థానం కోల్పోయాడు. ఇండియా తరపున జితేష్ ఇప్పటివరకు 9 టీ20 మ్యాచ్ లాడాడు. 5) కె.ఎస్. భారత్: టెస్ట్ జట్టులో స్థానం దక్కించుకున్న కె యస్ భరత్.. ఎన్ని అవకాశాలొచ్చినా ఒక్కసారి కూడా రాణించలేకపోయాడు. దీంతో భారత జట్టులో స్థానం కోల్పోవడంతో పాటు సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి అతనికి ఉద్వాసన పలికారు. రిషబ్ పంత్, ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్లుగా అందుబాటులో ఉండడంతో భరత్‌ను కాంట్రాక్ట్ జాబితా నుండి పూర్తిగా తొలగించారు.

## ఆ రెండు జట్లకు చావో రేవో.. ఒక్క మ్యాచ్ ఓడినా ఇంటికే





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 ప్రారంభమై ఆదివారం (ఏప్రిల్ 20)తో నెల రోజులైంది. అన్ని జట్లు ఇప్పటివరకు సగం మ్యాచ్ లు ఆడేశాయి. ప్లే ఆఫ్ కు వెళ్లే జట్లేవో.. టోర్నీ నుంచి నిష్క్రమించే జట్లేవో క్లారిటీ వచ్చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జయింట్స్ జట్లు ప్లే ఆఫ్ రేస్ లో దూసుకెళ్తున్నాయి. ఢిల్లీ, గుజరాత్ ఆడిన 7 మ్యాచ్ ల్లో 5 మ్యాచ్ లు గెలిస్తే.. బెంగళూరు, పంజాబ్, లక్నో ఆడిన 8 మ్యాచ్ ల్లో 5 మ్యాచ్ లు గెలిచాయి. ఈ ఐదు జట్లు మరో మూడు మ్యాచ్ లు గెలిచినా రాయల్ గా ప్లే ఆఫ్ లోకి అడుగుపెడతాయి. కోల్ కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్ కు వెళ్లాలంటే తీవ్రంగా శ్రమించాల్సిందే. కోల్ కతా మిగిలిన 7 మ్యాచ్ ల్లో 5 విజయాలు సాధించాలి. ఇక ముంబై మిగిలిన 6 మ్యాచ్ ల్లో 4 గెలవాలి. సన్ రైజర్స్ హైదరాబాద్ డేంజర్ జోన్ లో ఉంది. కమ్మిన్స్ సేన ఆడిన 8 మ్యాచ్ ల్లో 3 మాత్రమే గెలిచింది. ఆ జట్టు ప్లే ఆఫ్ కు సాధించాలంటే మిగిలిన 6 మ్యాచ్ ల్లో 5 మ్యాచ్ లు తప్పకుండా గెలిచి తీరాల్సిందే. అన్నిటికంటే దారుణమైన పరిస్థితిలో మాజీ ఛాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఉన్నాయి. ఈ రెండు జట్లు కూడా ఆడిన 8 మ్యాచ్ ల్లో కేవలం రెండు మ్యాచ్ లు మాత్రమే గెలిచి టోర్నీ నుంచి నిష్క్రమించే దశలో ఉన్నాయి. చెన్నై, రాజస్థాన్ మిగిలిన 6 మ్యాచ్ ల్లో తప్పకుండా గెలిస్తేనే ప్లే ఆప్స్ కు చేరతాయి. ఒక్క మ్యాచ్ ఓడిపోయినా ఇంటి దారి పట్టడం ఖాయం. ఈ రెండు జట్లకు ప్రస్తుతం నెట్ రన్ రేట్ కూడా మైనస్ ల్లో ఉంది. దీంతో తర్వాత ఆడబోయే మ్యాచ్ ల్లో భారీగా గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజస్థాన్ గురువారం (ఏప్రిల్ 24) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడాల్సి ఉంది. టోర్నీలో నిలవాలంటే ఈ మ్యాచ్ లో గెలుపు తప్పనిసరి. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్ శుక్రవారం (ఏప్రిల్ 25) సన్ రైజర్స్ హైదరాబాద్ తో తలపడుతుంది. చెన్నై ఈ మ్యాచ్ లో ఓడితే టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

# ట్రెండీ లుక్‌తో అనసూయ అరాచకం!

మొదట టెలివిజన్ రంగంలో గుర్తింపు అందుకుని ఆ తరువాత బిగ్ స్క్రీన్‌పై తనదైన ముద్ర వేసుకున్న నటి అనసూయ భరద్వాజ్. ఆమె టాలెంట్ అందం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. యాంకర్‌గా ఉన్నప్పుడు హ్యామర్‌తో ఆకట్టుకుంది. తర్వాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' లాంటి సినిమాలతో నటిగా ట్రాన్సిషన్ అద్భుతంగా చేసుకుంది. ముఖ్యంగా పుష్పలో 'దాక్షయణి' పాత్ర ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది.ఇక లేటెస్ట్ గా అనసూయ చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బ్లాక్ టాప్, స్కై బ్లూ స్కర్ట్‌లో ఓ మోడ్రన్ లుక్‌తో మెరిసిపోతున్న అనసూయ స్టైలిష్ గా దర్శనమిచ్చింది. జస్ట్ క్లాసిక్ లుక్ అని చెప్పుకోవచ్చు. మెటాలిక్ ఫాబ్రిక్ టచ్, జిప్ డిజైన్ విత్ స్లీవ్‌లెస్ స్టైల్‌తో ఈ డ్రెస్సింగ్ మోడర్న్ యూత్‌కు తెగ నచ్చేసినట్లు లైక్స్ చూస్తేనే అర్ధమవుతుంది.ఫోటోల్లో ఆమె ఎక్స్‌ప్రెషన్స్ మూడ్స్‌ను బాగా క్యాచ్ చేస్తూ కనిపించాయి. ఒక్కో పోజ్‌కి వేరే వేరే మూడ్‌ను చూపించగలిగిన అనసూయ ప్రొఫెషనల్ యాక్ట్రెస్‌గా ఎంత అభివృద్ధి చెందినదో స్పష్టంగా తెలుస్తోంది. ఆమె కళ్లలో కనిపిస్తున్న కాన్ఫిడెన్స్, కెమెరా ఫ్రెండ్లీ నేచర్ అన్నీ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తున్నాయి. ఈ ఫోటోలకు భారీ లైక్స్ వస్తుండగా, అభిమానులు కామెంట్స్‌లో "కిల్లర్ లుక్", "ఎటిట్యూడ్ క్వీన్", "బోల్డ్ అండ్ బ్యూటిఫుల్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌కి ఫ్యాషన్ ట్రెండ్ చెప్పేలా అనసూయ ఈ ఫోటోషూట్‌లో నలుగురికీ ప్రేరణగా నిలుస్తోంది. ప్రస్తుతం స్టార్ మా ఛానెల్‌లో ప్రసారమవుతోన్న 'కిరాక్ బాయ్స్ అండ్ ఖిలాడీ గర్ల్స్ 2' షోకి అనసూయ యాంకర్‌గా వ్యవహరిస్తోంది. ఈ షోలో ఆమె హోస్టింగ్ స్టైల్‌తో పాటు ఈ విధమైన ఫోటోషూట్స్‌తో మరింత ఫాలోయింగ్ పెంచుకుంటోంది. కెరీర్‌లోనే కాకుండా స్టైల్ లోనూ అనసూయ ఎప్పటికీ ట్రెండింగ్‌లోనే ఉంటుంది అనడానికి ఈ ఫోటోలు నిదర్శనం.



తమన్నా భాటియా గ్లామర్‌ని పునర్నిర్వచించింది





మేఘ చంద్ర పాత్రలో కోమలీ ప్రసాద్ యొక్క స్టైలిష్ అవతార్‌లు తప్పవు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com